ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు



సోమవారం 15 ఏప్రిల్ 2024



తెనాలిలో అభిమానులు, కార్యకర్తలకు అభివాదం తెలుపుతున్న పవన్‌కళ్యాణ్, పెమ్మసాని, మనోహర్



బస్సెక్కిన అభిమానం



• గజమాలతో అభిమానుల సత్కారం



తెనాలి మార్కెట్ సెంటర్‌లో సభకు హాజరైన అశేష జనవాహిని

జగన్‌ను తరిమికొట్టాలి

ప్రజల కోసం.. వారి శ్రేయస్సు కోసం.. రాష్ట్రం కోసం.. అమరావతి రాజధాని అభివృద్ధి కోసం.. అందరికీ అన్నం పెట్టే రైతుల శ్రేయస్సు కోసం.. నిరుద్యోగులు, కార్మికుల కష్టాలు తీర్చడం కోసం, ప్రజలందరికీ మంచి జరిగేలా సైకో ప్రభుత్వంపై పోరాటం చేసేందుకు పవన్‌కల్యాణ్ అనే నేను జనసేన పార్టీని స్థాపించి మీ ముందుకు వచ్చాను. సైనికుడిలా ప్రభుత్వంపై పోరాడుతున్నాను.. నా పోరాటానికి మీరంతా మద్దతుగా నిలిచారు.. మీ కోసం వచ్చా.. మార్పు కోసం ప్రయత్నిస్తున్నా.. రాష్ట్రాన్ని తీర్చిదిద్దుకోవాలి. పేదల పక్షపాతులమంటూ వారిపైనే పెత్తందారులుగా వ్యవహరిస్తూ రాష్ట్రాన్ని అధోగతిపాలు చేస్తున్నారు. పేదల సంక్షేమం పేరుతో కోటాను కోట్లు దోచేసిన వైసీపీ జగన్ ప్రభుత్వాన్ని రాష్ట్రం నుంచి తరిమికొట్టాలి.

పవనాభిమానం

తెనాలిలో ప్రభంజనం

- జనసేనానికి అపూర్వ స్వాగతం
- వారాహి విజయభేరికి జననీరాజనం
- రెండు కిలోమీటర్ల దూరానికి 2 గంటలు
- భారీ గజమాలలతో అభిమానుల సత్కారం



రోడ్‌షోలో పాల్గొన్న జనసేన, టీడీపీ, బీజేపీ అభిమానులు

తెనాలి రూరల్, ఏప్రిల్ 14: పవనాభిమానం పోటెత్తింది.. జనసేనానికి తెనాలి నీరాజనం పలికింది. తొలిసారి తెనాలి పర్యటనకు వచ్చిన పవన్‌కల్యాణ్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అభిమానులు గజమాలలతో స్వాగతం పలకగా.. మహిళలు హారతులు పట్టి దిష్టితీశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆదివారం వారాహి విజయభేరి సభలో పాల్గొనేందుకు తెనాలి వచ్చారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో సుల్తానాబాద్‌లో దిగారు. అనంతరం ఆయన అక్కడి నుంచి వారాహి వాహనంపై సుల్తానాబాద్, చెంచుపేట, మారీస్‌పేట మీదగా మహాత్మాగాంధీ మార్కెట్ కూడలి వరకు రోడ్ షో నిర్వహించారు. ఆయన వెంట పెద్దసంఖ్యలో అభిమానులు ద్విచక్రవాహనాలతో ర్యాలీగా పాల్గొన్నారు. దారిపొడవునా జనం నీరాజనం పట్టారు. కేవలం 2 కి.మీటర్ల దూరం రోడ్ షోకు రెండున్నర గంటలకుపైగా సమయం పట్టింది. అంగలకుదురు గణేష్ యూత్ నాయకుడు వీరవల్లి మురళి బృందం ఎక్స్‌కవేటర్ల సాయంతో భారీ గజమాలతో పవన్ కల్యాణతో పాటు, లోక్‌సభ, అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థులైన పెమ్మసాని చంద్రశేఖర్, నాదెండ్ల మనోహర్‌లను సత్కరించారు. దారిపొడవునా డివైడర్లపైన, భవనాలపైన జనం కిక్కిరిసి పోయారు. వారందరికీ పవన్ వారాహిపై నుంచి విజయకేతనం చూపుతూ అభివాదం చేస్తూ ముందుకు సాగారు.



రైతుల సమస్యలు వింటూ...

మార్కెట్ సెంటర్‌కు పోటెత్తిన జనం

మార్కెట్ సెంటర్‌లో సాయంత్రం 6 గంటలకు పవన్‌కల్యాణ్ వారాహిపై నుంచి ప్రసంగిస్తారని జనసేన నేతలు ప్రకటించారు. దీంతో సాయంత్రం 4 గంటలకే పెద్దసంఖ్యలో అక్కడకు జనం భారీగా చేరుకున్నారు. ఆయన సభ మొదలయ్యే సమయానికి సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. చాలావరకు గుంటూరు, వియవాడ ప్రధాన రహదారులపైనే జనం నిరీక్షించాల్సి వచ్చింది. భారీ సంఖ్యలో జనాన్ని చూసిన పవన్‌కల్యాణ్ ఉత్సాహంతో ప్రసంగాన్ని పరుగులు పెట్టించారు. మహిళలు, యువత, ఉద్యోగుల సమస్యలపై జనసేనాని ప్రసంగించేటప్పుడు జనం నుంచి భారీగా స్పందన వచ్చింది. పార్టీకి చిరంజీవి రూ.5 కోట్లు విరాళం ఇవ్వడంతో పాటు రామ్‌చరణ్‌ను కూడా విరాళం ఇవ్వాలని చెప్పారని, ఆయనకు తెనాలి వేదికగా కృతజ్ఞతలు చెబుతున్నట్లు ప్రకటించటంతో జనం నుంచి కేరింతలు వినిపించాయి. అంతకముందు హెలిప్యాడ్ వద్ద పవన్‌కు పెమ్మసాని చంద్రశేఖర్, నాదెండ్ల మనోహర్,మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తదితరులు శాలువాలు, పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.



అభిమానులతో సెల్ఫీ



కలెక్టరేట్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా తదితరులు

ఓటేయడమే అంబేద్కర్‌కు నిజమైన నివాళి

• జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల, ఏప్రిల్ 14: రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును అందరూ సద్వినియోగం చేసుకున్నప్పుడే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌కు ఘననివాళి అర్పించినట్లు అవుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. అంబేద్కర్ జయంతి కార్యక్రమాన్ని ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించా రు. జిల్లా అధికారులతో కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ప్రజలందరూ అన్ని హక్కులతో స్వేచ్ఛగా జీవించడానికి ముఖ్య కారణం అంబేద్కర్ ప్రసాదించిన రాజ్యాంగమేనన్నారు. సామాజిక అంతరాలపై అలుపెరగని పోరాటం చేసిన మహనీయులు అంబేద్కర్ అన్నా రు. దేశంలోని ప్రజలందరూ సమానంగా జీవించాలనే అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా అందరూ కలిసి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో సి.హెచ్.సత్తిబాబు, సాంఘిక సంక్షేమశాఖాధికారి జె.రాజాదెబోరా, మత్స్యశాఖ ఏడీ సైదా పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి..

కొనసాగుతున్న చేరికల పర్వం

దిక్కుతోచని స్థితిలో పాలక పార్టీ

బాపట్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అధికార వైసీపీ నుంచి టీడీపీలోకి వలసల పర్వం కొనసాగుతోంది. పర్చూరు నియోజకవర్గంలో అధికార పార్టీలోని కీలక నేతలు దాదాపు టీడీపీ బాట పడుతున్నారు. ఇప్పటికే చాలామంది కీలకనేతలతో పాటు కార్యకర్తలు కుటుంబాలతో సహా తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకున్నారు. చినగంజాం మండలానికి చెందిన వైసీపీ నేతలతో పాటు కార్యకర్తలు దాదాపు వెయ్యి మంది వారి కుటుంబాలతో సహా ఇటీవల టీడీపీ తీర్థం పుచ్చుకున్న సంగతి తెలిసిందే. ఇక ఆదివారం నియోజకవర్గ పరిధిలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. ఈ చేరికల పర్వంతో పర్చూరులో వైసీపీ దాదాపు ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొంది. మరో వైపు ఇప్పటికే కాడి వదిలేసిన పర్చూరు వైసీపీ అభ్యర్థి ఎడం బాలాజీ మొక్కుబడి పర్యటనలతో సరిపెడుతున్నారన్న ప్రచారం నియోజకవర్గంలో జోరుగా సాగుతోంది.

సస్పెన్షన్ ఎత్తివేత..

మాజీ మంత్రి బాలినేని అనుచరుడిగా ఉన్న భవనం శ్రీనివాసరెడ్డిపై గతంలో వైసీపీ అధిష్ఠానం సస్పెన్షన్ విధించింది. ఈయనపై చర్యలు తీసుకోవడంలో అప్పటి ఇన్‌చార్జి ఆమంచి ఒత్తిళ్లే పనిచేశాయనే ప్రచారం జోరుగా నడిచింది. సీన్ కట్ చేస్తే పర్చూరులో వైసీపీ దాదాపు ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొని ఉండడంతో ఆయనపై విధించిన సస్పెన్షన్‌ను విధిలేని పరిస్థితుల్లో ఎత్తివేస్తూ వైసీపీ అధిష్ఠానం ఆదివారం నిర్ణయం తీసుకుంది. చినగంజాం మండలానికి చెందిన వైసీపీ నేత, ఓ ముఖ్య ప్రజాప్రతినిధి టీడీపీలో చేరడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకున్నట్లు సమాచారం. మాజీ మంత్రి బాలినేని తనయుడి బుజ్జగింపుతో తాత్కాలికంగా ఆయన దానిని వాయిదా వేసుకున్నట్లు తెలుస్తోంది. కానీ ఇప్పటికే ఆ మండలంలోని ద్వితీయశ్రేణి నేతాగణమంతా టీడీపీ గూటికి చేరడం గమనార్హం. తర్వలో సదరు ముఖ్య నేత కూడా టీడీపీ తీర్థం పుచ్చుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.



మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జాస్తి వెంకటనారాయణను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘనలు

నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ ఆందోళనలు • ప్రేక్షకపాత్రకే పరిమితమైన ఎన్నికల అధికారులు

అద్దంకి, ఏప్రిల్ 14: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. రాజకీయ నేతల కార్యక్రమాలకు అధికారుల నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి. అయితే అద్దంకిలో వైసీపీ నేతలు ఎన్నికల నియమావళిని పట్టించుకోవడంలేదు. వైసీపీ నాయకులు యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘి స్తున్నా అధికారులకు పట్టడంలేదు. అధికార పార్టీకి అధికారులు కొమ్ముకాస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఎన్నికల నియమాళికి విరుద్ధంగా ఇటీవల అద్దంకిలో పలు సంఘటనలు చోటుచేసుకోగా, ఆదివారం మధ్యాహ్నం ఏకంగా నామ్‌రోడ్డుపై రాస్తారోకో చేశారు. విజయవాడలో సీఎంపై రాయి దాడిని నిరసిస్తూ ఆదివారం పట్టణంలోని శింగరకొండరోడ్డులో వైసీపీ కార్యాలయం ఎదుట నామ్‌రోడ్డుపై వైసీపీ అద్దంకి అభ్యర్థి పాణెం చినహనిమిరెడ్డి పలువురు నేతలు, కార్యకర్తలతో కలిసి రాస్తారోకో చేశారు. కూటమి పార్టీలు దురుద్దేశంతో జగన్‌పై దాడి చేయించాయని ఆయన ఆరోపించారు. పైగా వైసీపీ తలుచుకుంటే టీడీపీ నేతలు, కార్యకర్తలకు పుట్టగతులు ఉండవని తీవ్రస్థాయిలో హెచ్చరిస్తూ మాట్లాడారు. ఉన్నతాధికారులు స్పందించి కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన వైసీపీ శ్రేణులపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు.



రాస్తారోకో చేస్తున్న వైసీపీ అభ్యర్థి చినహనిమిరెడ్డి, శ్రేణులు

ఎమ్మెల్యే రఘుపతిపై ఫిర్యాదు

బాపట్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ జయంతి వేడుకల సందర్భంగా ఆదివారం స్థానిక జమ్ములపాలెం ఫ్లైఓవర్ బ్రిడ్జి దగ్గర అంబేద్కర్ విగ్రహం వద్ద తలెత్తిన ఉద్రిక్త పరిస్థితులకు సంబంధించి వైసీపీ ఎమ్మెల్యే కోన రఘుపతిపై టీడీపీ నేతలు బాపట్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రాత్రి ఫిర్యాదు చేశారు. పార్టీ శ్రేణుల తో కలిసి రెచ్చగొట్టే విధంగా కోన వ్యవహరించాని ఫిర్యాదులో వారు పేర్కొన్నారు. ఉద్రిక్తత లు తలెత్తడానికి కారణం ఆయనేనని అందులో వివరించారు. ఫిర్యాదు తీసుకునే విషయంలో దాదాపు గంటపాటు పోలీసులు తర్జనభర్జన పడ్డట్లు సమాచారం. డీఎస్పీతో సంప్రదించిన అనంతరం టీడీపీ నేతల నుంచి పోలీసులు ఫిర్యాదు తీసుకున్నారు. టీడీపీ నేతల ఫిర్యాదు అందిందని కేసు నమోదు విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని టౌన్ సీఐ తెలిపారు.

దిక్సూచి
DIKSUCHI

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ హిస్టరీ

గుప్తుల కాలంలో సామాజిక, ఆర్థిక పరిస్థితులు



భారతదేశ చరిత్రలో గుప్తుల కాలాన్ని పరిశీలించే క్రమంలో ఆనాటి సామాజిక, ఆర్థిక తదితర పరిణామాలను తరచి చూడాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులు వీటిని మరింత లోతుగా తెలుసుకోవాలి.

గుప్తుల కాలం నాటి సమాజంలో నాలుగు వర్ణాలతో పాటు 'చండాలులు' అనే పంచమ వర్ణం ఏర్పడింది. దీనిని ఫాహియాన్ 'అంటరాని వర్ణం'గా పేర్కొన్నాడు. వర్ణాశ్రమ ధర్మాలు ఉండేవి. అయినప్పటికీ 'వర్ణ సంకర' విధానం కొనసాగింది. వర్ణాశ్రమ ధర్మం కాపాడటానికి 'అభయదత్తుడు' అనే ఉద్యోగిని రాజు నియమించాడు. శాతవాహనుల మాదిరిగానే వీరు కూడా బ్రాహ్మణులకు అగ్రహారాలు(గ్రామాలు) దానంగా ఇచ్చేవారు.

గుప్తుల కాలంలో స్త్రీ స్వేచ్ఛ తగ్గిపోయింది. సతీసహగమనం, బాల్య వివాహాలు, బహుభార్యత్వం వంటి అనాచారాలు కొనసాగాయి. అనులోమ, ప్రతిలోమ వివాహాలు ఉండేవి. పురుషులు అధిక వర్ణం స్త్రీలను వివాహాలు చేసుకోవడాన్ని ధర్మశాస్త్రాలు నిషేధించాయి. క్రీ.శ.510లో 'ఏరాన్' శాసనాన్ని భానుగుప్తుడు చెక్కించాడు. దీనిలో సతీసహగమనం, దేవదాసి ఆచారం ఉన్నట్లు రాసి ఉంది. సమాజంలో శెట్టిలు(వ్యాపారులు), జీతిక అనే వృత్తిపనివారు ఉన్నారని 'భితారి' శాసనంలో రాశారు. సేద్య బానిసలు, జాజ్‌మని అనే వ్యవస్థకు గుప్తుల కాలంలోనే పునాది పడింది. ఈ వ్యవస్థకు గల కారణాలు 'ఇండోర్' శాసనంలో ఉన్నాయి.

నలంద విశ్వవిద్యాలయం

దీనిని కుమారగుప్తుడు నిర్మించాడు. తరవాత పుష్యభూపతి వంశంలో హర్షుడు ఈ విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ కేంద్రంగా అభివృద్ధి చేశాడు. ఆ తరవాత పాలరాజులకు చెందిన ధర్మపాలుడు కూడా ఈ విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేశాడు. సంస్కృతంలో 'నలం' అంటే జ్ఞానం లేదా పద్మం అని, 'ద' అంటే ఇవ్వడం అని అర్థం. నలంద విశ్వవిద్యాలయంలో మూడు గొప్ప గ్రంథాలయాలు ఉన్నాయి. వీటికి తురుష్కరాజులు సహాయం చేశారు. 12వ శతాబ్దంలో భక్తియార్ ఖిల్జీ చేతిలో ఈ విశ్వవిద్యాలయం పతనం చెందింది.



ఆర్థిక విధానం

భూములను సామంతులకు, ఉద్యోగులకు, బ్రాహ్మణులకు దానాలుగా ఇవ్వడం వల్ల రాజుకు భూమిపై అధికారం తగ్గింది. రాజుకు, సాగుచేసే సామాన్య రైతుకు మధ్య అనేక మంది మధ్యవర్తులు ఉండటంతో ఫలితాన్ని అనుభవించే భూస్వామ్య వ్యవస్థ ఏర్పడింది. ఈ భూస్వామ్య వ్యవస్థ గురించి 'భితారి' శాసనంలో రాశారు. 'సార్థవాహనులు' అనే సంచార వర్తకులు కూడా నగరాల్లో ఎక్కువగా ఉండేవారు. రైతులపై హిరణ్య(నగదు పన్ను); కొనుగోలు మీద వేసే క్లిప్త, ఉపక్లిప్త పన్నులు; అమ్మకపు పన్ను; వ్యవసాయానికి వాడుకునే నీటిపై వేసే వతభూత పన్ను గుప్తుల కాలంలో విధించేవారు.

భూ విభజన: భూములను ఖిల్ల(వ్యవసాయ), క్షేత్ర(నివాస), స్థల(అటవీ) అని మూడు రకాలుగా విభజించారు.

నాణేలు: కంస, సిక్క

విదేశీ వాణిజ్యం: గుప్తులు ఎక్కువగా ఆగ్నేయాసియా దేశాలతో వర్తక వాణిజ్యాలు నిర్వహించేవారు. అరికమేడు, ముజ్రిస్, కావేరి రేవు పట్టణాలు ప్రసిద్ధి. పర్షియా, అరేబియా, ఆఫ్ఘానిస్థాన్ దేశాల నుంచి గుర్రాలను దిగుమతి చేసుకునే వారు.

మత విధానం

వైదిక మతం పునరుద్ధరించారు. క్రతువులు, యజ్ఞయాగాలు పెరిగాయి. వేదాలు వినడం, ఇతిహాసాలు చదవడానికి శూద్రులకు అవకాశం కల్పించారు. దశావతారాలు, త్రిమూర్తులను నాటి ప్రజలు పూజించేవారు. బౌద్ధ, జైన మత సూత్రాలను హిందూ మతం గ్రహించింది. శైవ మతానికి ఆదరణ పెరిగింది. మూఢ నమ్మకాలు కూడా పెరిగాయి. విగ్రహారాధన స్థిరపడింది.

వైష్ణవం: ఈ మతంలో నూతన శాఖలు ఏర్పడ్డాయి. పంచరాత్రి, వైఘానస మొదలైన శాఖలు ఏర్పడ్డాయి. రెండో చంద్రగుప్తుడు పరమ భాగవతుడని పేరు పొందాడు.

శైవం: శైవంలో తాంత్రిక శాఖలు, భక్తి శాఖలు ఏర్పడ్డాయి. వీటిని కాపాలిక, కాలాముఖ శాఖలు అనేవారు. మితవాద శాఖలు కూడా ఉండేవి. శివున్ని లింగ రూపంలో పూజించడం ప్రారంభించారు. ఇది మొదట కశ్మీర్‌లో ప్రారంభమైంది. అభినవ గుప్తుడు త్రిక అనే శాఖను ప్రారంభించాడు. వసుగుప్తుడు ప్రత్యాభిజ్ఞా అనే శైవ శాఖను ప్రారంభించాడు.

జైన మతం: అనేక జైన స్థావరాలు నిర్మించారు. గుజరాత్‌లో జైనమతం అభివృద్ధి చెందింది.

బౌద్ధ మతం: అనేక ప్రాంతాల్లో బౌద్ధ విహారాలు నిర్మించారు. బుద్ధగయలో బౌద్ధ విహారం నిర్మించడానికి శ్రీలంక రాజు మేఘవర్ణుడికి సముద్రగుప్తుడు అనుమతించి పరమత సహనం చాటాడు. మథుర, సార్‌నాథ్, కోశాంబి మొదలైనవి బౌద్ధ కేంద్రాలుగా అభివృద్ధి చెందాయి. అసంగుడు, పరమార్థుడు, దిగ్నాగుడు ఈ కాలపు గొప్ప బౌద్ధ పండితులు.

గుప్తుల పరమత సహనం: గుప్తులు హిందూ మతాభిమానులైనా..పరమత సహనం చూపారు. బౌద్ధ, జైనులకు పదవులు ఇచ్చారు. దానాలు చేశారు. విరాళాలు ఇచ్చారు. రెండో చంద్రగుప్తుని సేనాని 'అమరక దేవుడు' బౌద్ధుడు.

సాహిత్యం

గుప్తుల కాలం సాహిత్యానికి స్వర్ణయుగం అని చెప్పవచ్చు. సముద్రగుప్తుడు స్వయంగా కవి. అతనికి 'కవిరాజు' అనే బిరుదు ఉండేది. రెండో చంద్రగుప్తుని కాలంలో 'నవరత్నాలు' అని పేరుపొందిన కవులు ఉండేవారు. వారిలో ప్రపంచ ప్రఖ్యాతి చెందిన కాళిదాసు ఒకరు. ఈయన రాసిన 'అభిజ్ఞాన శాకుంతలం' గ్రంథాన్ని సర్ విలియం జోన్స్ ఆంగ్లంలోకి అనువదించాడు. 'మాళవికాగ్నిమిత్రం' నాటకంలో ఉజ్జయని రాకుమార్తె మాళివికను మగధ యువరాజు అగ్నిమిత్రుడు చేసుకున్న వివాహం(రాక్షస వివాహం) గురించి కాళిదాసు అద్భుతంగా రాశాడు.

గుప్తుల కాలంలో కొనసాగిన సాహిత్య సేవను చరిత్రకారులు గ్రీస్‌లోని పెరిప్లస్ యుగంతో, రోమ్‌లోని అగస్టస్ యుగంతో, ఇంగ్లాండ్‌లోని ఎలిజబెత్ యుగంతో పోల్చారు. గుప్త రాజులు సంస్కృత, సాహిత్య రంగాల్లో చేసిన సేవల వల్లనే వారి యుగానికి స్వర్ణయుగం అనే పేరు వచ్చింది. గుప్త చక్రవర్తులు స్వయంగా పండితులు. అలహాబాద్ ప్రశస్తి శాసనంలో కావ్యశైలిలో హరసేనుడు అద్భుతంగా రాశాడు.

నవరత్నాలలో ఒకడైన కాళిదాసు రఘువంశం, కుమార సంభవం, మేఘసందేశం అనే కావ్యాలు రాశాడు. అదేవిధంగా ఇతర కవుల గ్రంథాలు... శూద్రకుడు - మృచ్ఛకటికం; విశాఖదత్తుడు- ముద్రా రాక్షసం, దేవీచాంద్రగుప్తం; భానుడు- వాసవదత్త, విష్ణుశర్మ- పంచతంత్రం మొదలైనవి. అమరసింహుడు 'అమరకోశం' అనే వ్యాకరణ గ్రంథాన్ని రాశాడు. కామాంధకుడు 'నీతి శాస్త్రం' రచించాడు. ఇది గుప్తుల కాలంలో వచ్చిన రాజకీయ గ్రంథం. మౌర్యుల అర్థ శాస్త్రంతో పోల్చదగినది.

వేదాంత శాస్త్రాలు: ఈ కాలంలో అద్భుతమైన గ్రంథాలు వచ్చాయి. అసంగుడు బౌద్ధ గ్రంథాలపై వ్యాఖ్యానాలు రాయగా, దిగ్నాగుడు ప్రమాణచముచ్చేయం రాసి తర్కశాస్త్ర పితగా ప్రసిద్ధి చెందాడు. అష్టాదశ పురాణాలను ఈ కాలంలోనే రాశారు. మనుధర్మశాస్త్రం, యజ్ఞవల్క్యస్మృతి మొదలైనవి ఈ కాలంనాటి ప్రముఖ గ్రంథాలు.

విజ్ఞానశాస్త్ర గ్రంథాలు: గుప్తుల కాలంలో సాహిత్యంతోపాటు విజ్ఞాన శాస్త్రం కూడా అభివృద్ధి చెందింది. గణిత, ఖగోళ, భౌతిక, వైద్యశాస్త్రాలు అభివృద్ధి చెందాయి. దశాంశ పద్ధతి, సున్నా విలువలు వాడుకలోకి వచ్చాయి. రెండో చంద్రగుప్తుడు ఉజ్జయినిలో నక్షత్రశాలను నెలకొల్పాడు. మెహరోలిలో నక్షత్రాల పరిశీలన కోసం వరహామిహిరుడికి రెండో చంద్రగుప్తుడు ఎత్తయిన ఇనుప స్తంభం నిర్మించి ఇచ్చాడు. రోమక, జాతక, లఘు అనే గణితశాస్త్ర గ్రంథాలను వరహమిహిరుడు రాశాడు. అదేవిధంగా బృహత్‌సంహిత గ్రంథంలో భూగోళ, ఖగోళ, జ్యోతిష, వృక్ష శాస్త్రాల గురించి రాశాడు. ఆర్యభట్టీయం, సూర సిద్ధాంతాలను ఆర్యబట్టు రచించాడు. వీటిలో సూర్య, చంద్ర గ్రహణాల గురించి వివరించాడు. వాగ్భటుడు వైద్యంలో అష్టాంగ సంగ్రహం అనే గ్రంథం రాశాడు. పాలకశ్యపుడు హస్తాయుర్వేదంలో పశు వైద్యం గురించి రాశాడు. ధన్వంతరి, శుశ్రుతుడు గుప్తుల కాలంలో గొప్ప వైద్యులు.



డాక్టర్ ఐ. నీలా
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల, సూర్యాపేట్.

రీజనింగ్

పోటీపరీక్షల ప్రత్యేకం

కోడింగ్ - డీకోడింగ్

పార్ట్-3

1. ఒక కోడ్ భాషలో MERITను 7, 18, 9, 22, 14గా రాశారు. అదే కోడ్ భాషలో PONDSను ఏ విధంగా రాస్తారు?

ఎ) 11, 12, 23, 13, 8 బి) 11, 13, 12, 8, 23 సి) 8, 23, 13, 12, 11 డి) ఏదీకాదు

సమాధానం: (సి)

వివరణ: MERIT అనే పదంలోని అక్షరాలకు అపసవ్యదిశలో వర్ణమాల ప్రకారం సంఖ్యలు వరుసగా M అనగా 14వ అక్షరం, E అనగా 22, R అనగా 9, I అనగా 18, T అనగా 7. ఈ సంఖ్యలను రివర్స్ చేయగా 7, 18, 9, 22, 14. ఇదే విధంగా PONDS అనే పదాల్లోని అక్షరాలకు అపసవ్యదిశ వర్ణమాల ప్రకారం సంఖ్యలు వరుసగా P అనగా 11, O అనగా 12, N అనగా 13, D అనగా 23, S అనగా 8. కావున 8, 23, 13, 12, 11 అనగా 'సి' సమాధానం అవుతుంది.

2. ఒక కోడ్ భాషలో LUNCHను 58గా రాశారు. అదే కోడ్ భాషలో FRUITను ఏ విధంగా రాస్తారు?

ఎ) 74 బి) 68 సి) 72 డి) ఏదీకాదు

సమాధానం:(ఎ)

వివరణ: LUNCH అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా L అనగా 12, U అనగా 21, N అనగా 14, C అనగా 3, H అనగా 8, 12+21+14+3+8=58. ఇదే విధంగా PONDS అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా F అనగా 6, R అనగా 18, U అనగా 21, I అనగా 9, T అనగా 20. కావున 6 +18+21 + 9 + 20=74 సమాధానం అవుతుంది.

3. ఒక కోడ్ భాషలో BIGను 324గా రాశారు. అదే కోడ్ భాషలో ACTను ఏ విధంగా రాస్తారు?

ఎ) 576 బి) 529 సి) 676 డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: BIG అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 2, 9, 7 వీటిని కూడగా 2+9+7=18. ఈ 18 వర్గం (స్క్వేర్) 324. అదే విధంగా ACT అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 1, 3, 20 వీటిని కూడగా 1+3+20=24. ఈ 24 వర్గమే (స్క్వేర్) 576.

4. ఒక కోడ్ భాషలో AIMను 251గా రాశారు. అదే కోడ్ భాషలో INKను ఏ విధంగా రాస్తారు?

ఎ) 416 బి) 398 సి) 264 డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: AIM అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 1, 9, 13. వీటి విడివిడి వర్గాలను కూడగా అనగా $1^2, 9^2, 13^2$ = 1+81+169=251 అదే విధంగా INK అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 9, 14, 11. వీటి విడివిడి వర్గాలను కూడగా అనగా $9^2, 14^2, 11^2$= 81+196+121=398 సమాధానం అవుతుంది.

5. ఒక కోడ్ భాషలో HATను 160గా రాశారు. అదే కోడ్ భాషలో 'PAN'ను ఏ విధంగా రాస్తారు?

ఎ) 224 బి) 242 సి) 422 డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: HAT అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 8, 1, 20. వీటిని గుణించగా 8x1x20=160 అదే విధంగా PAN అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు 16, 1, 14 వీటిని గుణించగా 16x1x14 = 224 సమాధానం అవుతుంది.

6. ఒక కోడ్ భాషలో PLANEను 96గా రాశారు. అదే కోడ్ భాషలో SOLVEను ఏ విధంగా రాస్తారు?

ఎ) 142 బి) 144 సి) 146 డి) ఏదీకాదు

సమాధానం: (సి)

వివరణ: PLANE అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు P అనగా 16, L అనగా 12, A అనగా 1, N అనగా 14 E అనగా 5 వీటిని కూడగా 16+12+1+14+5=48కి రెట్టింపు 96. అదే విధంగా SOLVE అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలు S అనగా 19, O అనగా 15, L అనగా 12, V అనగా 22, E అనగా 5 వీటిని కూడగా 19+15+12+22+5=73 కి రెట్టింపు 146 సమాధానం అవుతుంది.

7. ఒక కోడ్ భాషలో SMART ను 128గా రాశారు. అదే కోడ్ భాషలో RANGEను ఏ విధంగా రాస్తారు?

ఎ) 180 బి) 160 సి) 168 డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: SMART అనే పదంలోని అక్షరాలకు అపసవ్య దిశ వర్ణమాల ప్రకారం సంఖ్యలు వరుసగా S అనగా 8, M అనగా 14, A అనగా 26, R అనగా 9, T అనగా 7. వీటిని కూడగా 8+14+26+9+7=64కి రెట్టింపు 128. ఇదేవిధంగా RANGE అనే పదంలోని అక్షరాలకు అపసవ్యదిశలో వర్ణమాల ప్రకారం సంఖ్యలు R అనగా 9, A అనగా 26, N అనగా 13, G అనగా 20, E అనగా 22 వీటిని కూడగా 9+26+13+20+22=90 రెట్టింపు 180 సమాధానం అవుతుంది.

8. ఒక కోడ్ భాషలో LIKEను 33గా రాశారు. అదే కోడ్ భాషలో EARNను ఏ విధంగా రాస్తారు?

ఎ) 34 బి) 38 సి) 37 డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: LIKE అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా 12+9+11+5=37. ఇచ్చిన పదంలో 4 అక్షరాలు ఉన్నాయి. కావున 37 నుంచి 4 తీసివేస్తే 37-4=33. అదే విధంగా EARN అనే పదంలోని అక్షరాలకు వర్ణమాల ప్రకారం గల సంఖ్యలను కూడగా 5+1+18+14=38. ఇచ్చిన పదంలో 4 అక్షరాలు ఉన్నాయి. కావున 38 నుంచి 4 తీసివేస్తే 38-4=34 సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

దక్షిణ భారత్‌కూ బుల్లెట్ రైలు

- 'ఒకే దేశం ఒకే ఎన్నిక' నిర్వహిస్తాం..
- ఇంటింటికీ నీరు, పైప్‌లైన్‌తో గ్యాస్
- అన్నదాతలందరికీ డ్రోన్లు
- ఉమ్మడి పౌరస్మృతి అమలు చేస్తాం
- బీజేపీ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీలు



బీజేపీ మ్యానిఫెస్టోను విడుదల చేస్తున్న మోదీ, నడ్డా, రాజ్‌నాథ్‌సింగ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): గత పదేళ్లలో సాధించిన ప్రగతిని వివరిస్తూ.. మళ్లీ అధికారంలో వస్తే ఐదేళ్లలో ఏం చేస్తామో చెబుతూ.. దేశ ప్రగతి, యువత, మహిళలు, పేదలు, రైతులు, కార్మికుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ రూపొందించిన బీజేపీ లోక్‌సభ ఎన్నికల మ్యానిఫెస్టోను ఆ పార్టీ అగ్రనేతలు ఆవిష్కరించారు. మోదీకి గ్యారెంటీ శీర్షికతో ఉన్న ఈ మ్యానిఫెస్టోను ఢిల్లీలోని కేంద్ర కార్యాలయంలో ఆదివారం మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్ రాజ్‌నాథ్ సింగ్, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ దక్షిణాదికీ బుల్లెట్ రైలు సేవలను విస్తరిస్తామని హామీ ఇచ్చారు. ఉత్తర, తూర్పు భారత్‌కూ బుల్లెట్ రైలు వేస్తామన్నారు. దీనిపై త్వరలో సర్వే ప్రారంభం కానుందని పేర్కొన్నారు. శరవేగంగా సాగుతున్న ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు పనులు పూర్తయ్యే దశకు వచ్చాయని.. ఈ అనుభవంతో మిగతా మూడు ప్రాంతాలకూ విస్తరిస్తామని చెప్పారు. వందే భారత్ రైలు సేవలను దేశవ్యాప్తం చేస్తామన్నారు. ఒకే దేశం, ఒకే ఎన్నిక నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)ని అమలు చేస్తామని తెలిపారు. ముద్ర పథకం రుణ పరిమితిని రూ.20 లక్షలకు పెంచుతామని ప్రకటించారు. ప్రతి ఇంటికీ నీరు, పైప్ ద్వారా గ్యాస్ అందిస్తామని హామీ ఇచ్చారు. పీఎం సూర్య ఘర్ ద్వారా జీరో పవర్ బిల్‌ను సాకారం చేస్తామన్నారు. మరో ఐదేళ్లపాటు ఉచిత రేషన్ అందిస్తామని మోదీ తెలిపారు. ఇప్పటికే 4కోట్ల ఇళ్లు కట్టించామని.. మధ్య తరగతికి మరో 3కోట్ల ఇళ్లు నిర్మిస్తామని వెల్లడించారు.

నాలుగు స్తంభాలతో సంకల్ప్ పత్ర

పేదలు, యువశక్తి, అన్నదాత, నారీశక్తి.. అనే నాలుగు స్తంభాలపై సంకల్ప్ పత్రకు పునాదులు వేశామని మోదీ వెల్లడించారు. పదేళ్లలో ఎంతో ప్రగతిని సాధించామని, 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చామని అందుకే బీజేపీ మ్యానిఫెస్టో కోసం యావత్ దేశం ఎదురుచూసిందని చెప్పారు. భారత్‌ను గ్రీన్ ఎనర్జీ, ఫార్మా, ఎలక్ట్రానిక్, ఆటోమొబైల్, సెమీ కండక్టర్ హబ్‌గా మారుస్తామని ప్రకటించారు. వ్యవసాయంలో డ్రోన్‌ల వినియోగం పెంచుతామని మోదీ చెప్పారు. ప్రతి రైతు ఇంటిపై డ్రోన్లు తిరిగే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. అభివృద్ధికి ఆటంకంగా మారిన అవినీతిని అంతమొందించడానికి ఎంతో చేశామని, భవిష్యత్తులోనూ దీనిని కొనసాగిస్తామని చెప్పారు. 140 కోట్ల మంది ప్రజలను దృష్టిలో పెట్టుకుని మ్యానిఫెస్టోను తయారు చేసామని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. మోదీ గ్యారెంటీపత్రం 24 క్యారెట్ల బంగారంతో సమానమన్నారు. మోదీ గ్యారెంటీ, 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యాలుగా పేర్కొన్న బీజేపీ మ్యానిఫెస్టో తొలి కాపీలను ఐదేళ్లలో కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన నలుగురికి అందజేశారు. విశ్వబంధు, స్వస్థ భారత్, సురక్షిత భారత్, సుస్థిర భారత్, సమృద్ధ భారత్, సాంకేతిక, ప్రపంచ తయారీ కేంద్రం, అత్యుత్తమ శిక్షణ, క్రీడా, సాంస్కృతిక వికాసం, ఈజ్ ఆఫ్ లివింగ్, సుపరిపాలన అంశాలను మ్యానిఫెస్టోలో పొందుపరిచారు.

మ్యానిఫెస్టోలోని కీలక అంశాలు

ట్రాన్స్‌జెండర్లకూ ఆయుష్మాన్ భారత్; వందేభారత్ స్లీపర్, చైర్ కార్, మెట్రో రైల్ సర్వీసుల ప్రారంభం; జాతీయ విద్యా విధానం అమలు; 2036లో ఒలింపిక్స్ నిర్వహణ; పీఎం ఆవాస్ యోజనలో దివ్యాంగులకు ప్రాధాన్యం; యువతకు మౌలిక సదుపాయాల కల్పన; పర్యాటక రంగంలో లక్షల ఉద్యోగాల కల్పన; 3కోట్ల మంది మహిళలను లక్షాధికారుల చేసే లక్ష్యం; ఈశాన్యంలో సైన్యానికి ప్రత్యేకాధికారాల చట్టం క్రమంగా ఎత్తివేత; ఈ-శ్రమ్ పోర్టల్ ద్వారా గిగ్ వర్కర్లు, ట్యాక్సీ, ఆటో, ట్రక్కు డ్రైవర్లకు సంక్షేమ పథకాలు; తిరువళ్లూర్ కల్చరల్ సెంటర్ ద్వారా భారత సంస్కృతి ప్రపంచ దేశాలకు పరిచయం; ఉన్నత విద్యాసంస్థల్లో భారతీయ భాషల అధ్యయనానికి తోడ్పాటు; ఐరాస భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వానికి ప్రయత్నం; ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేలా శాటిలైట్ పట్టణాలు; ఏకలవ్య పాఠశాలలు, పీఎం జన్‌మన్ పథకాలకు ప్రాధాన్యం; అంతరిక్షంలో భారత స్పేస్ స్టేషన్ నిర్మాణం.

నిరుద్యోగం కనపడలే.. ద్రవ్యోల్బణం వినపడలే

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ


దేశ ప్రజల జీవితాల్లో ఎంతో కీలకమైన నిరుద్యోగం, ద్రవ్యోల్బణం అనే అంశాలు బీజేపీ మ్యానిఫెస్టోలో లేనే లేవని, మోదీ ప్రసంగంలోనూ వినపడలేదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తప్పుబట్టారు. ఈమేరకు ఆయన ట్వీట్ చేశారు. ఈ రెండు అంశాలపై చర్చించడం బీజేపీకి ఇష్టం లేదని విమర్శించారు. యువత ఈసారి మోదీ వలలో పడదని, ఉపాధి విప్లవం రాబోతోందని వ్యాఖ్యానించారు. కాగా, మోదీ గ్యారెంటీ ఒక జుమ్లా అని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. యువతకు ఏటా 2కోట్ల ఉద్యోగాల హామీ ఏమైందని ప్రశ్నించారు. రైతు ఆదాయం రెట్టింపు చేశారా? అని నిలదీశారు. దక్షిణాదికీ బుల్లెట్ రైలు అంటున్నారని.. మొదటి బుల్లెట్ రైలే ఇంకా పట్టాలెక్కలేదని ఎద్దేవా చేశారు.

సెల్ టవర్ లేకున్నా మొబైల్ కమ్యూనికేషన్!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 14: స్మార్ట్‌ఫోన్ కమ్యూనికేషన్స్‌లో చైనా విప్లవాత్మక ఆవిష్కరణను తీసుకొచ్చింది. భూమిపై ఉన్న సెల్ టవర్ల అవసరం లేకుండా నేరుగా స్మార్ట్‌ఫోన్ కమ్యూనికేషన్‌ను సాధ్యం చేయగలిగేలా ప్రపంచంలోనే మొదటి ఉపగ్రహాన్ని ఆ దేశ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. స్వర్గంతో కనెక్ట్ అవ్వడం అని అర్థం వచ్చేలా దీనికి 'టియాంటాంగ్' అని దీనికి పేరుపెట్టారు. ఎనిమిదేళ్ల క్రితం చైనా రోదసీలోకి పంపిన 'టియాంటాంగ్-1' ఉపగ్రహ శ్రేణి ప్రస్తుతం మూడుకు చేరింది. ఇవి జియోసింక్రోనస్ కక్ష్యలో తిరుగుతూ మొత్తం ఆసియా-పసిఫిక్ ప్రాంతాన్ని కవర్ చేస్తున్నాయి. దీంతో ఈ ప్రాంతమంతా మొబైల్ శాటిలైట్ కనెక్టివిటీకి మార్గం సుగమమైంది. చైనాకు చెందిన 'హువావే' ఇప్పటికే ప్రపంచంలోనే శాటిలైట్ కనెక్టివిటీని సపోర్ట్ చేసే మొదటి మొబైల్ కంపెనీగా గుర్తింపు పొందింది. హువావే టెక్నాలజీస్ గతేడాది సెప్టెంబరులో శాటిలైట్ కాల్స్‌కు మద్దతునిచ్చే స్మార్ట్‌ఫోన్‌ను విడుదల చేసింది. తాజాగా ఆ జాబితాలో షియోమి, హానర్, ఒప్పో వంటి మొబైల్ కంపెనీలు కూడా చేరాయి. గతేడాది డిసెంబరు 18న చైనాలోని గాన్సు ప్రావిన్స్‌లో 6.2 తీవ్రతతో భూకంపం సంభవించినప్పుడు.. సాంప్రదాయ కమ్యూనికేషన్ వ్యవస్థలు పనిచేయలేదు. ఈ సమయంలో బాధితుల్లో కొందరు శాటిలైట్ కాల్ సౌకర్యం ద్వారా బాహ్య ప్రపంచంతో సమాచారాన్ని పంచుకోగలిగారు.

జంట నగరాల నుంచి తరలిరానున్న ఓటర్లు

- మే 10, 11, 12 తేదీల్లో రైళ్లలో బుకింగ్ అయిపోయిన టిక్కెట్‌లు
- కేవలం ఒక్క వందేభారత్‌లో మాత్రమే ఖాళీలు
- అవి కూడా కొద్ది రోజుల్లో రిజర్వేషన్ అయిపోయే అవకాశం



చెన్నై ఎక్స్‌ప్రెస్‌లో మే 10, 11, 12 తేదీల్లో రిగ్రెట్

గుంటూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని సికింద్రాబాద్, హైదరాబాద్‌లలో నివసిస్తున్న జిల్లాకు చెందిన ప్రజలు ఓటుహక్కుని వినియోగించుకొనేందుకు భారీగా స్వస్థలాలకు రానున్నారు. మే 13న సోమవారం పోలింగ్ జరగనుండటంతో ఆ నెల 10, 11, 12 తేదీల్లో జిల్లాకు వచ్చేందుకు ఇప్పటికే వేలమంది రైళ్లలో టిక్కెట్‌లు బుకింగ్ చేసుకొన్నారు. ఈ కారణంగా ఆ మూడురోజుల్లో ఒక్క వందేభారత్ మినహా సికింద్రాబాద్‌లో బయలుదేరి గుంటూరు మీదగా ప్రయాణించే ఏ ఒక్క రైలులోనూ ఖాళీలు లేవు. చెన్నై ఎక్స్‌ప్రెస్‌కి అయితే కనీసం వెయిటింగ్ లిస్టులోనూ టిక్కెట్ బుకింగ్ చేసుకొనే అవకాశమే లేకుండా నోబుకింగ్ పడిపోయింది. దీంతో ప్రత్యామ్నాయంగా ఆర్‌టీసీ, ప్రైవేటుబస్సులు, సొంత వాహనాల్లో ప్రజలు ఓటువేసేందుకు రావాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రద్దీని దృష్టిలో పెట్టుకొని ఛార్జీలు పెంచేందుకు ప్రైవేటుట్రావెల్స్ ఆపరేటర్లు సిద్ధమయ్యారు.

సికింద్రాబాద్ నుంచి ప్రధానంగా గుంటూరుకు ఇంటర్‌సిటీ, పల్నాడు, ఫలక్‌నుమా, నారాయణాద్రి, నరసపూర్, శబరి, విశాఖ, చెన్నై, డెల్టా, రేపల్లె ఎక్స్‌ప్రెస్‌లు వస్తుంటాయి. దీంతోపాటు వరంగల్ మీదగా గోల్కొండ, ఇంటర్‌సిటీ రైళ్లు వస్తాయి. నంద్యాల మార్గంలోనూ మరో రెండు రైళ్లు గుంటూరుకు చేరతాయి. లింగంపల్లి - విజయవాడ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లో వెయిటింగ్ లిస్టు మూడు తేదీల్లో 105నుంచి 204 మధ్యన ఉన్నది. ఫలక్‌నుమాలో 200 దాటిపోయింది. జన్మభూమిలో అయితే మే 11వ తేదీన నో బుకింగ్ పడింది. నారాయణాద్రి రైలులోనూ 155వరకు వెయిటింగ్ లిస్టు ఉన్నది. నరసపూర్‌లో మే 11న రిగ్రెట్ 10, 12తేదీల్లో 300 వెయిటింగ్ లిస్టు దాటింది. శబరి, విశాఖ, పల్నాడులోనూ చాంతాడంత వెయిటింగ్ లిస్టులున్నాయి. చెన్నై ఎక్స్‌ప్రెస్‌లో మూడు రోజులు రిగ్రెట్ పడటం ఆశ్చర్యం కలిగిస్తున్నది. డెల్టా, రేపల్లె ఎక్స్‌ప్రెస్‌లోనూ వెయిలింగ్ లిస్టు 203కి చేరింది.

వీటన్నింటిని పరిగణనలోకి తీసుకొంటే మే 10, 11, 12 తేదీల్లో దాదాపుగా 50వేల నుంచి 60వేల మధ్యన ప్రయాణీకులు ఉమ్మడి గుంటూరు జిల్లాలో ని వేర్వేరు ప్రాంతాలకు ఒక్క రైళ్లలో రానున్నారని స్పష్టమౌతున్నది. ఇక బస్సులు, సొంత వాహనాల్లో వచ్చేవారి సంఖ్య కూడా మరో 25వేలకు పైగా ఉండొచ్చని అంచనా. దీని దృష్ట్యా దాదాపుగా 50వేల మందికి పైగానే జంట నగరాల్లో నివసిస్తున్న ఓటర్లు ఇక్కడికి వచ్చి ఓటుహక్కు వినియోగించుకో నున్నారని అంచనా. రెండు రాష్ట్రాల్లోనూ 11 రెండో శనివారం, 12 ఆదివారం, 13 పోలింగ్ డే సెలవుదినాలు కావడంతో ఓటు వేసేందుకు అందరూ తరలి వస్తున్నారు. ఎన్నికల ఫలితాల్లో వీరి ఓట్ల ప్రభావం కూడా ఈ దఫా ఎక్కువగానే ఉంటుందని అంచనా.

కొమ్మాలపాటికి పల్నాడు జిల్లా పగ్గాలు



గుంటూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌ను పల్నాడు జిల్లా పార్టీ అధ్యక్షుడిగా నియమిస్తూ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కే అచ్చెన్నాయుడు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. నియోజకవర్గంలోని పేదల పెన్నిధిగా పెదకూరపాడు నియోజకవర్గంలో మమేకమైన కొమ్మాలపాటికి ఈ పర్యాయం ఎమ్మెల్యే టిక్కెట్టు అధిష్టానం ఇవ్వలేక పోయింది. అయితే అందుకు ప్రతిగా కొమ్మాలపాటికి తగిన ప్రాధాన్యం కల్పించాలని నారా చంద్రబాబు నాయుడు నిర్ణయం తీసుకున్నారు. తాము అధికారంలోకి రాగానే కొమ్మాలపాటికి ఎమ్మెల్సీ పదవి కట్టబెడతానని పెదకూరపాడు నియోజకవర్గంలో ఇటీవల జరిగిన సభలో చంద్రబాబు బహిరంగంగా చెప్పారు. పార్టీ అధికారంలోనికి రావడమే ముఖ్యమని భావించిన శ్రీధర్ ఇప్పటికే తనకు బదులుగా సీటు దక్కించుకున్న భాష్యం ప్రవీణ్ విజయానికి అహర్నిశలు పాటుపడుతున్నారు. అందరూ ఊహించిన విధంగానే శ్రీధర్‌కు పల్నాడు జిల్లా పార్టీ అధ్యక్ష పదవిని అదిష్టానం కట్టబెడుతూ ఆదేశాలు జారీ చేసింది.

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ శివరామ్



సత్తెనపల్లి, ఏప్రిల్ 14: టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సత్తెనపల్లి నియోజక వర్గ టీడీపీ నేత డాక్టర్ కోడెల శివరామ్‌ను టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కోడెల శివరామ్ నియామకం పట్ల పలువురు టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. తనపై ఎంతో నమ్మకం ఉంచి పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించిన టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకు డాక్టర్ కోడెల శివరాం కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడుకు డాక్టర్ కోడెల కుటుంబం అంటే ఎంతో అభిమానం అని అన్నారు. తనపై నమ్మకంతో పదవిని అప్పగించిన చంద్రబాబు నాయుడు నమ్మకాన్ని వమ్ముచేయకుండా పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించడమే తన ధ్యేయం అన్నారు. డాక్టర్ కోడెల అభిమానులు పలువురు డాక్టర్ కోడెల శివరాంకు అభినందనలు తెలిపారు.

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాడిశెట్టి మురళి



గుంటూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా తాడిశెట్టి మురళీమోహన్ నియమితుడయ్యారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆదేశానుసారం ఆదివారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీచేశారు. ఇటీవలే టీడీపీలో చేరిన మురళీమోహన్‌కు రాష్ట్ర కమిటీలో చోటు కల్పించడం ద్వారా చంద్రబాబు తగిన గౌరవం ఇచ్చారు. వైఎస్ మరణానంతరం జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన మురళి ఆ పార్టీ కోసం కష్టపడ్డారు. అయితే సీఎం జగన్ తాడిశెట్టి సోదరులకు ఎలాంటి పదవులు ఇవ్వకుండా అన్యాయం చేశారు. మరోవైపు వైసీపీ పాలనపై ప్రజల్లో తీవ్రవ్యతిరేకత కూడగట్టుకోవడంతో తాడిశెట్టి అనుచరుల విజ్ఞప్తి మేరకు ఇటీవలే టీడీపీలో చేరారు. తనను టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించడంపై తాడిశెట్టి మురళీమోహన్ స్పందిస్తూ అధినేత చంద్రబాబునాయుడుకు, నారా లోకేశ్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుకు, పెమ్మసాని చంద్రశేఖర్, బూర్ల రామాంజనేయులుకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని చెప్పారు.

టీడీపీ రాష్ట్ర కమిటీలో పలువురికి పదవులు

- కార్యనిర్వాహక కార్యదర్శిగా నల్లపాటి
- కార్యదర్శులుగా పంగులూరు, కళ్లం


నల్లపాటి రామచంద్ర ప్రసాద్, పంగులూరు అంజయ్య

నరసరావుపేట, ఏప్రిల్14: రాష్ట్ర టీడీపీ కమిటీలో జిల్లాకు చెందిన నేతలు పలువురికి చోటు దక్కింది. కార్యనిర్వాహక కార్యదర్శిగా నరసరావుపేట నియోజకవర్గానికి చెందిన నల్లపాటి రామచంద్రప్రసాద్‌ను నియమించారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం ఆదివారం ఉత్తర్వులు విడుదల చేసింది. గతంలో నల్లపాటి రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. నరసరావుపేట అసెంబ్లీ టిక్కెట్‌ను కూడా ఆయన ఆశించారు. మాచర్ల నియోజకవర్గానికి చెందిన కళ్లం రామాంజిరెడ్డి, పంగులూరు అంజయ్యను రాష్ట్ర పార్టీ కార్యదర్శులుగా నియమించారు. తమను నియమించడం పట్ల నల్లపాటి, పంగులూరు, కళ్లంలు పార్టీ అధిష్టానం, జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీకి రాజీనామా చేసిన ఎస్సీ సెల్ నేత


గద్దల వేదమణి

దాచేపల్లి, ఏప్రిల్ 14: వైసీపీ నాయకత్వం నియంతృత్వ పోకడలను వ్యతిరేకిస్తూ కార్మిక నాయకులు, వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు గద్దల వేదమణి పార్టీ పదవులకు, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆదివారం వేదమణి మాట్లాడుతూ వైసీపీలో తాను కొనసాగటం ఇష్టంలేకనే పార్టీకి రాజీనామా చేశానని వివరించారు. డాక్టర్ అంబేద్కర్ ఇచ్చిన ఆత్మగౌరవం, బడుగు బలహీనవర్గాల అభివృద్ధే ధ్యేయంగా తాము ఆయన బాటలో ప్రయాణం చేస్తామని స్పష్టం చేశారు. త్వరలో తన రాజకీయ నిర్ణయాన్ని ప్రకటిస్తానని వివరించారు.

మూడు రాజధానులు ముగిసిన అధ్యాయం

- 1580వ రోజుకు చేరిన రైతుల ఆందోళనలు



బిల్డ్ అమరావతి అంటూ తుళ్లూరులో నినాదాలు చేస్తున్న మహిళలు రైతులు

తుళ్ళూరు, ఏప్రిల్ 14: రాజధాని అమరావతి విషయంలో సీఎం జగన్‌రెడ్డి మాట తప్పి మడమ తిప్పాడని రాజధానికి 33వేల ఎకరాల భూములు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న నిరసన దీక్షలు, ఆందోళనలు ఆదివారం నాటికి 1580వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా పలువురు మహిళలు, రైతులు మాట్లాడుతూ అమరావతిని బ్రహ్మాండంగా కడతామని చెప్పిన జగన్‌రెడ్డి మూడు ముక్కల ఆటతో నిర్వీర్యం చేశాడన్నారు. ప్రజావేదిక కూల్చివేతతో ప్రారంభమైన పరిపాలన రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి తీసుకెళ్ళేంత వరకు వచ్చిందన్నారు. మూడు ప్రాంతాల అభివృద్ధి గురించి ఆలోచించకుండా ప్రయోజనం లేని మూడు రాజధానుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. అమరావతి అభివృద్ధిని కాలరాసిన వైసీపీ పాలకులను చిత్తుగా ఓడించాలని విజ్ఞప్తి చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాల్లో ఆందోళనలు నిరసనలు కొనసాగుతున్నాయి.

ఒక్క రూపాయి కూడా అవినీతికి పాల్పడను

- పవన్ ముందు ప్రమాణం చేసిన డాక్టర్ పెమ్మసాని


తెనాలి వచ్చిన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): నాకు డబ్బు మీద ఆశ లేదు, కీర్తికాంక్షలు మీద ఆశ అంతకంటే లేదని తెలుగుదేశం పార్టీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం తెనాలి పర్యటనకు వచ్చిన జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు ఆయన పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ తనకు స్వార్థం ఏమాత్రం లేదన్నారు. పవన్ కళ్యాణ్ ముందు ప్రమాణం చేసి చెబుతున్నా వచ్చే 30 సంవత్సరాలు ఒక్క రూపాయి కూడా అవినీతి చేయనన్నారు. ప్రజల అభిమానాన్ని అభివృద్ధి రూపంలో తిరిగి ఇస్తానని చెప్పారు.

రైల్వేస్టేషన్లలో తాగునీటికి ఏర్పాట్లు

- ప్రధాన ప్లాట్‌ఫాంలపై వాటర్ కూలర్లు



రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన కూలింగ్ వాటర్ ట్యాప్‌లు

గుంటూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచే ఎండలు మండుతుండటం, వడగాడ్పులు వీస్తుండటంతో రైళ్లలో ప్రయాణం చేసేవారు తాగునీటికి ఇబ్బంది పడకుండా రైల్వేశాఖ విస్తృత ఏర్పాట్లుచేసింది. రైళ్లు ఆగే ప్రతీ రైల్వేస్టేషన్‌లోనూ వాటర్ కూలర్లను ఏర్పాటుచేసినట్లు అధికారవర్గాలు తెలిపాయి. అలానే స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతోనూ చల్లని తాగునీటిని అందించే సదుపాయాలను ఏర్పాటు చేశామన్నాయి. రూ.5కే లీటర్ శుద్ధి చేసిన నీటిని విక్రయించే ఆర్‌వో ప్లాంట్లను కూడా 24 గంటలు అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నాయి. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని అన్ని స్టేషన్లలో తాగునీటి సదుపాయం కల్పించామని డీఆర్ఎం ఎం.రామకృష్ణ తెలిపారు. హై లెవల్, గ్రౌండ్ లెవల్ ట్యాంకులలో నీటి లభ్యత పుష్కలంగా ఉండేలా చూసేందుకు ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేశామని డీఆర్ఎం తెలిపారు.

జగన్‌రెడ్డి ఎన్ని డ్రామాలు ఆడినా టీడీపీదే విజయం

- టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారునాయక్

గుంటూరు, ఏప్రిల్ 14: జగన్ రెడ్డి మీద రాయితో ఎవరు దాడి చేసినా తప్పు తప్పే దానిని టీడీపీ ఖండిస్తుందని అయితే జగన్ రెడ్డి ఎన్ని డ్రామాలు ఆడినా అంతిమ విజయం టీడీపీదేనని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారూనాయక్ అన్నారు. జగన్ రెడ్డి గత ఎన్నికల్లో కోడి కత్తి డ్రామా, బాబాయి హత్య వంటి నాటకాలలో భాగమే ప్రస్తుత రాయి దాడి అని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. జగన్ జరగని దాడిని జరిగినట్లు ప్రచారం చేసుకొని సానుభూతి కోసం పాకులాడుతున్నారన్నారు. ఇలాంటి కుట్రలు ఎన్ని చేసినా ప్రజలు నమ్మటానికి సిద్ధంగా లేరన్నారు. దాడి జరిగిన నాలుగు నిమిషాల్లోనే క్యాట్ బాల్ ఉపయోగించారు అని వైసీపీ అనుకూల మీడియాకు ఎలా తెలిసింది అని ప్రశ్నించారు. తాడేపల్లి ప్యాలెస్ డైరెక్షన్‌లో డీజీపీ, ఇంటిలిజెన్స్ ఐజీ ఆడిన నాటకంలో భాగంగానే ఈ దాడి అని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి మీద దాడి జరిగితే ఇక సామాన్య జనం భద్రత ఈ జగన్ ప్రభుత్వంలో ఎలా ఉందో అందరికి అర్థం అవుతుందన్నారు. జగన్‌రెడ్డి ఈ ఎన్నికలలో ఘోర పరాజయం చవిచూస్తారని అన్నారు.

డాబా పైనుంచి పడి వ్యక్తి మృతి

దాచేపల్లి, ఏప్రిల్ 14: ప్రమాదవశాత్తు డాబా పైనుండి కిందపడి తీవ్రగాయాలపాలై చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలోని గామాలపాడు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రోళ్ల ప్రసాదరావు (40) ఈ నెల 12వ తేదీన డాబాపైన నిద్రిస్తూ మధ్యలో నిద్రలేచి ఏమరుపాటుగా వున్న సమయంలో డాబా పైనుంచి జారిపడి తీవ్రగాయాలపాలయ్యాడు. కుటుంబసభ్యులు గుంటూరు జీజీహెచ్‌కి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. దాచేపల్లి ఎస్ఐ శివనాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు వున్నారు.

కొలువుదీరిన ఎఫ్‌పీఎస్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గం

గుంటూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ఆదివారం నగరంలోని అరండల్‌పేటలో ఉన్న అసోసియేషన్ హాల్‌లో నూతన అధ్యక్షుడిగా వజ్రాల వెంకట నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎన్.అశోక్ ఆనంద రెడ్డి, కోశాధికారిగా కె.విజయకుమార్, నలుగురు ఉపాధ్యక్షులు, నలుగురు కార్యదర్శులు, 52మంది కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. దీనికి గౌరవాధ్యక్షుడు పోసాని నాగేశ్వరావు అధ్యక్షత వహించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కొత్తగా ఎన్నికైన వెంకట నాగిరెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో డీలర్లకు ఏ సమస్యలు వచ్చినా కూడా వాటిని అందరం కలిసికట్టుగా ఎదుర్కొంటామన్నారు.

సమావేశంలో రసాభాస

సమావేశంలో కొద్దిసేపు రసాభాస జరిగింది. అసోసియేషన్ నూతన కార్యవర్గానికి జరిగిన ఎన్నికల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏకగ్రీవంగా కాకుండా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలానే అసోసియేషన్‌కు రూ.కోటి నిధి ఉందని, జమాఖర్చుల వివరాలు బయట పెట్టాలన్నారు. మధ్యాహ్న భోజన విరామం అనంతరం అసంతృప్తులను బుజ్జగించి వారికి నామినేటెడ్ పదవులు ప్రకటించి ప్రమాణ స్వీకారాన్ని ముగించారు.

'పశ్చిమ' ఎన్నికల పరిశీలకుడిగా మల్లెల రాజేశ్ నాయుడు



గుంటూరు, ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడిగా చిలకలూరిపేట నియోజకవర్గానికి చెందిన మల్లెల రాజేశ్ నాయుడు నియమితులయ్యారు. ఆ మేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటన విడుదల చేశారు.

క్రేన్ ఢీకొని ఆటో డ్రైవర్ మృతి


సలోమాన్ మృతదేహం

మాచర్ల రూరల్, ఏప్రిల్ 14: వెనుకగా వచ్చిన క్రేన్ ఢీకొనడంతో ఆటోడ్రైవర్ మృతిచెందిన ఘటన మాచర్లలో ఆదివారం రాత్రి జరిగింది. రెంటచింతల మండలం తుమ్మకోటకు చెందిన ఆలేటి సలోమాన్(45) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి తుమ్మకోట నుంచి ప్రయాణికులతో ఆటోలో మాచర్ల పట్టణానికి చేరుకున్నాడు. ఆటోను కూరగాయల మార్కెట్ వద్ద నిలిపి టీ తాగేందుకు పార్కుసెంటర్‌కు వచ్చాడు. రోడ్డు దాటుతుండగా వెనుకగా స్పీడ్‌గా వచ్చిన క్రేన్ బలంగా ఢీకొట్టగా కిందపడిపోయాడు. అతని తలపై నుంచి క్రేన్ దాటింది. దీంతో తల పగిలి సలోమాన్ అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ శరత్‌బాబు సంఘటనా ప్రదేశానికి చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్రేన్ డ్రైవర్ కొండమల్లి లక్ష్మణస్వామిని అదుపులోకి తీసుకొని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే పీఆర్కే ప్రచారంలో గజమాల వేసి వస్తూ..

కాగా పట్టణంలోని 30వ వార్డు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఆదివారం రాత్రి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి గజమాల వేసేందుకు వైసీపీ శ్రేణులు శ్రీలక్ష్మీ క్రేన్ సర్వీసుకు చెందిన ఏపీ39 ఈఈ 5424 నంబరు గల క్రేన్‌ను ఏర్పాటుచేశారు. ఎమ్మెల్యే పీఆర్కేకు గజమాల వేసి ప్రచారం ప్రారంభమయ్యాక తిరిగి వెళ్తూ పార్కుసెంటర్లో సలోమాన్‌ను రోడ్డు దాటుతుండగా ఢీకొట్టి అతని మృతికి కారణమైంది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


కేదారినాథ్ మృతదేహం

కాకుమాను, ఏప్రిల్ 14: వాహనం ఢీ కొనడంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని అప్పాపురంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ రవీంద్ర కథనం మేరకు... గణపవరపు కేదారినాథ్(19) బైక్‌పై అప్పాపురం నుంచి పెదనందిపాడు వైపు వెళుతున్నాడు. శివారు మలుపులో వేగంగా వస్తున్న టాటా ఏస్ వాహనం ఢీకొంది. దీంతో కేదారినాథ్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కేదార్‌నాథ్‌ది బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం భీమవరం గ్రామం. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కాకుమాను పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.04
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

సానుభూతి కోసమే గులకరాయి డ్రామా: అనగాని



రేపల్లె: ఎన్నికల్లో సానుభూతి కోసమే ముఖ్యమంత్రి జగన్ గులకరాయి డ్రామా ఆడుతున్నారని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఆది వారం ఓ లేఖలో పేర్కొన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి ప్రజలకు చెప్పుకోవటానికి ఒక్క మంచిపని చేయకపోగా అవినీతి, అక్రమాలతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారనన్నారు. ఒక్క పరిశ్రమను తేకపోగా ఒక్క సాగునీటి ప్రాజెక్టు కూడా పూర్తి చేయకుండా రాష్ట్రాన్ని అగాథంలో నెట్టారన్నారు. జగన్‌రెడ్డి చేపట్టిన ఎన్నికల ప్రచారంలో తీవ్ర ప్రజా వ్యతిరేకత వ్యక్తమౌటంతో కొత్త డ్రామాకు తెరలేపరన్నారు. నాలుగు రోజుల్లో సంచలన ఘటన రాష్ట్రంలో జరుగుతుందని ఈ ఘటన ఎన్నికల మూడ్ మార్చివేస్తుందని వైసీపీ నేత అవుతు శ్రీధర్‌రెడ్డి చెప్పిన నాలుగోరోజే ఈ గులకరాయి ఘటన జరగటం ఈ డ్రామాలో భాగం కాదా అని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

గులకరాయి డ్రామాను ఎవరూ నమ్మరు : యరపతినేని



పిడుగురాళ్ల, ఏప్రిల్ 14: ఐదేళ్లపాటు ముఖ్యమంత్రిగా ఉన్న జగన్‌రెడ్డి పరదాల చాటున తిరుగుతూ ఇప్పుడు ఎన్నికలకు ముందు సరికొత్త నాటకమైన గులకరాయి డ్రామాను రాష్ట్ర ప్రజలు ఎవరు నమ్మే స్థితిలో లేరని గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. పిడుగురాళ్లలో యరపతినేని విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ 2019 ఎన్నికలకు ముందు కోడికత్తి డ్రామా, వివేక గొడ్డలి వేటు డ్రామాను రాష్ట్ర ప్రజలు ఎవరూ కూడా నమ్మలేదని, దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ కూడా కోడికత్తి కేసులో జగన్ ఆడించిన డ్రామానేనని నిగ్గు తేల్చిందన్నారు. అధికారంలో ఉన్న జగన్ సభకు విద్యుత్ నిలిపివేసి చీకట్లో ఆడిన డ్రామాను చూసి రాష్ట్ర ప్రజలందరూ నిన్ను నమ్మం జగన్ అంటున్నారని అన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న జగన్‌కు ఉన్న భద్రత, నిఘా అధికారులు, రోప్ పార్టీ ప్రత్యేక బలగాలు, నిరంతరం లైవ్ కార్యక్రమాలు ఉండే సభలను గులకరాయి డ్రామా సమయంలో ప్రత్యక్ష ప్రసారాలు ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించారు.

కోడికత్తి తరహాలో గులకరాయి డ్రామా: జీవీ



వినుకొండటౌన్, ఏప్రిల్14: రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి జనాదరణ కోల్పోయి ఎన్నికల సమయంలో ప్రజల సానుభూతి కోసం మరోసారి డ్రామాలకు తెరలేపారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మండిపడ్డారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ ఆస్కార్ స్థాయి నటనలు, గోబెల్‌ను మించిన వైసీపీ ఐప్యాక్ అబద్ధపు ప్రచారాన్ని చూసి నవ్వుకుంటున్నా వారికి సిగ్గు రావడం లేదన్నారు. కేవలం రెండు నిమిషాల వ్యవధిలోని తెలుగుదేశం పార్టీ వారే దాడిచేశారని చిత్రీకరించడం దుర్మార్గం కాదా అని ప్రశ్నించారు. ఘటన జరిగిన వెంటనే వైసీపీ నాయకులు చేతుల్లో పట్టుకున్న ప్లకార్డులను కూడ ముందే సిద్ధం చేసుకున్నారంటే మరింత ఆశ్చర్యంగా ఉందన్నారు. ఈ నాటకం కోసమే కరెంటు కూడా తీసివేశారన్నారు. విజయవాడలో జరిగిన ఘటనలో పెద్ద కుట్ర దాగి ఉందని నాడు కోడికత్తి డ్రామా ఓట్లు కురిపించినట్లే ఈ నాటకంతో జనం మారిపోతారనే భ్రమలో జగన్, ఆ పార్టీ నాయకులు ఉన్నారని ఎద్దేవా చేశారు. కాని ప్రతిసారి కట్టుకథలు నమ్మడానికి ప్రజలు అమాయికులు కాదన్నారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, జగన్మోహన్ రెడ్డి చొరవతో చెరువులు నింపారని అనడం హాస్యస్పదంగా ఉందన్నారు. తాగునీటి పథకానికి 160కోట్లు నిధులు తెస్తే ఖర్చు చేయని అసమర్థ ఎమ్మెల్యే బొల్లా అన్నారు. కార్యక్రమంలో పత్తి పూర్ణ, దానయ్య, షమీమ్, దాసరి కోటేశ్వరరావు, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

జనాదరణ లేక జగన్నాటకానికి తెర : ధూళిపాళ్ళ



పొన్నూరుటౌన్, ఏప్రిల్14: జనాదరణ లేకపోవటంతో సరికొత్త జగన్నాటకానికి తెర తీసారని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో నరేంద్రకుమార్ మాట్లాడుతూ జగన్‌పై జరిగిన దాడిని అందరూ ఖండించాలన్నారు. కానీ దాడి జరిగిన పది నిమిషాలోనే మంత్రులు అధికార పార్టీ నాయకులు సోషల్ మీడియాలో తెలుగుదేశం పార్టీపై వ్యతిరేకంగా పోస్టులు పెట్టారన్నారు. రోడ్ షోలో కరెంటు తీసి దాడికి పాల్పడింది అధికార పార్టీ వారేనని ఆరోపించారు. సానుభూతి కోసమే దాడి నాటకానికి తెరలేపారన్నారు. కోడి కత్తి కేసులో తెలుగుదేశం పార్టీ పాత్ర లేదని ఎన్ఐఏ నిర్ధారించిందని చెప్పారు. అలాగే వివేకానంద రెడ్డి హత్య కేసులో ఆ నాడు చంద్రబాబు పాత్ర ఉందని వైసీపీ నాయకులు ఆరోపణలు చేశారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ కేసులో ఇంత వరకు విచారణ ప్రారంభం కాలేదన్నారు. మొన్న కోడి కత్తి డ్రామా ఆడిన వారు ఇప్పుడు రాయి డ్రామా ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు అమలులో ఉన్నప్పటికి వైసీపీ వర్గీయులు రోడ్లపైకి వచ్చి నిరసనలు సాగించారన్నారు. రాబోయే ఎన్నికలో సానుభూతి కోసమే రాయి డ్రామాగా పేర్కొన్నారు.

కొత్త డ్రామాకు తెర తీసిన జగన్: ఆనందబాబు



వేమూరు, ఏప్రియల్ 14: ముఖ్యమంత్రి జగన్ తిరిగి తెరపై కొత్త డ్రామాకు తెర తీయడం జరిగిందని మాజీమంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు విమర్శించారు. తెలుగుదేశం పార్టీ అధినేత కుట్రపూరిత రాజకీయంతో జగన్‌పై రాళ్ళు వేయించారని అసత్యాలు పలకడం సరికాదని ఖండించారు. గతంలో ఎన్నికల ముందు కూడా ఇలాగే ప్రజల నుంచి సానుభూతిని పెంచుకునేందుకు కోడికత్తి కేసును సృష్టించడం జరిగిందన్నారు. అధికారం కోసంగా పూర్తిగా దిగజారి జగన్ ప్రవర్తిస్తున్నాడని అన్నారు. ఎన్నికలకు నెల ముందుగా బాబాయిని దారుణ హత్య చేయించిన జగన్ తిరిగి ఈ రోజున కచ్చితంగా ఎన్నికలకు నెల ముందు రాయి దాడి ఉదంతాన్ని ప్రజల్లోకి తీసుకురావడం తిరిగి అధికారం కోసమే చేస్తున్న ప్రయత్నంలో భాగమన్నారు. ఇలాంటి దుష్ట ఆలోచన మీద ఆధారపడి ఎంత కాలం బతుకుతాడు అని కూడా ప్రశ్నించారు. ప్రజలు ఒక్కసారి నమ్ముతారు కానీ పదే పదే అలాంటి తప్పుడు వ్యవహారాలు చేస్తే నమ్మటానికి ఏ ఒక్కరూ గాజులు తడుక్కొని లేరు అన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి రాష్ట్రానికి భద్రత కల్పించాల్సిన నువ్వే నీకు భద్రత లేదు అని చెప్పుకోవడం సిగ్గు లేదా అని అన్నారు. నీ చేతగాని తనం బట్టబయలు అవుతుందని తెలిపారు. టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ఆయన తనయుడు లోకేష్ పర్యటనలో కరెంట్ కట్ చేస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని తక్షణమే జగన్‌పై రాయి విసిరిన ఘటన మీద విచారణ జరిపించి దోషులను శిక్షించడం జరుగుతుందన్నారు.

నాడు కోడి కత్తి.. నేడు గులకరాయి డ్రామా: బ్రహ్మారెడ్డి



మాచర్లటౌన్, ఏప్రిల్ 14: జగన్ యాత్రకు ప్రజా స్పందన లేకపోవడంతో, బస్సు యాత్ర తుస్సుమనడంతో బులుగు మీడియా ఆధ్వర్యాన నెత్తికి రాయి డ్రామా మొదలుపెట్టారని కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికలకు ముందు కోడి కత్తి, బాబాయి హత్యడ్రామాలు ఆడి ప్రత్యర్థులపై నిందలు మోపి జగన్ అధికారంలోకి వచ్చాడని అన్నారు. ఘటన జరిగిన నాలుగో నిమిషానికే బులుగు మీడియాలో క్యాట్‌బాల్‌తో దాడి చేశారని ఎలా చెప్పగలిగారన్నారు. డ్రామా జరిగినప్పుడు చుట్టూ వైసీపీ నేతలు, పోలీసులే ఉన్నారని, నిందితులను ఎందుకు పట్టుకోలేదని అన్నారు. క్యాట్ బాల్‌తో కొడితే కనుబొమ్మల పైనే ఎలా తగులుతుందని, దీనిపై ప్రజలందరికీ అవగాహన ఉందని అన్నారు. ముఖ్యమంత్రిపై జరిగిన దాడి పూర్తిగా విజయవాడ సీపీ వైఫల్యమన్నారు. లేకపోతే కుట్రలో భాగస్వాములా..? గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లు విసురుతుంటే భద్రతా వలయం ఏం చేస్తోందని ప్రశ్నించారు. విజయవాడలో రాత్రి 7 గంటలకు కరెంట్ పోవడం, 8:10 గంటలకు దాడి అంటూ ప్రచారం చేసుకోవడం, 11 గంటలకు కుటుంబ సమేతంగా ఆసుపత్రికి వెళ్లడం ఇదంతా సానుభూతి డ్రామా కాదా అని ప్రశ్నించారు.

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

బాపట్లలో.. వైసీపీ కవ్వింపు

అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఉద్రిక్తత



వేగేశన నరేంద్రవర్మ, కృష్ణప్రసాద్‌లను చుట్టుముట్టి తోసేస్తున్న వైసీపీ అల్లరిమూకలు

బాపట్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ విగ్రహం సాక్షిగా వైసీపీ నేతలు కవ్వింపు చర్యలకు పాల్పడిన ఘటన బాపట్లలో ఆదివారం చోటుచేసుకుంది. టీడీపీ బాపట్ల ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్‌తో పాటు ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మలు పార్టీ కార్యకర్తలతో కలిసి అంబేద్కర్ జయంతి సందర్భంగా నివాళులు అర్పించడానికి జమ్ములపాలెం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్దకు వచ్చారు. అదే సమయంలో వైసీపీ ఎమ్మెల్యే కోన రఘుపతి అనుచరులు జై కోన అని నినదిస్తూ ఆయనను భుజాల మీద మోస్తూ అక్కడకు వచ్చారు. టీడీపీ అభ్యర్థుల మీదకు వైసీపీ కార్యకర్తలు దూసుకు వచ్చారు. ఈ క్రమంలో వేగేశనను వైసీపీ శ్రేణులు తోసివేశాయి. టీడీపీ, వైసీపీ శ్రేణులు పోటాపోటీ నినాదాలతో ఆ ప్రాంతం కొంతసేపు రణరంగాన్ని తలపించింది. ఈ క్రమంలో వైసీపీ, టీడీపీ శ్రేణులు పరస్పరం సవాళ్లు విసురుకోవడంతో కొంతసేపు అక్కడ యుద్ధవాతావరణం నెలకొంది. పట్టణ సీఐ సూచనతో అక్కడి నుంచి వెళ్లడానికి వేగేశన సిద్ధపడుతుండగానే వైసీపీ శ్రేణులు ఆయనపైకి దూసుకువచ్చాయి. నరేంద్ర వర్మ అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి వెళ్లాక ఎమ్మెల్యే కోన రఘుపతిని అనుమతించాల్సి ఉండగా అలా చేయకుండా ఇద్దరిని ఒకేసారి అనుమతించడం కూడా ఈ ఘటనకు కారణంగా కనిపిస్తోంది.

దళితులను అణగదొక్కుతున్న జగన్మోహన్‌రెడ్డి

● బోడపాడు, ప్యాపర్రు ఎన్నికల ప్రచారంలో ఆనందబాబు



బోడపాడు ప్రసంగిస్తున్న మాజీ మంత్రి ఆనందబాబు

అమృతలూరు, ఏప్రిల్ 14: నా దళితులు అంటూనే దళితులను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అణగద్రొక్కారని ఉమ్మడి అభ్యర్థి ఆనందబాబు తెలిపారు. దళితులకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యను అందకుండా చేశారన్నారు. దళితులకు దక్కాల్సిన 27 పథ కాలను రద్దు చేశారని చెప్పారు. టీడీపీ అధికా రంలోకి వచ్చిన వెంటనే పింఛన్‌దారులకు నెలకు రూ.4వేలకు పెంచుతుందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. ఆది వారం రాత్రి మండల పరిధిలోని బోడపాడు, ప్యాపర్రు గ్రామాల్లో ఆనందబాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాని కి పట్టిన పీడ, జగన్ పరిపాలనను అంతమొందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మోపర్రు - బోడపాడు గ్రామాల మధ్య రోడ్డు ఎంత అధ్వానంగా ఉందో నియోజకవర్గ అభివృద్ధి కూడా అలానే ఉందన్నారు. రోడ్డు అధ్వానంగా ఉండటంతో ప్రమాదాలు జరిగి ప్రజలను చనిపోతున్నా ఎవరు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్త పరిచారు. నవరత్నాలు అంటూ నవ మోసాలకు పాల్పడిన వ్యక్తి జగన్ అన్నారు. చంద్రబాబు ముందు చూపుకు తోడు, పవన్ కల్యాణ్ తోడ య్యాడని, దీంతో రాష్ట్రం ఎంతో ముందుకు సాగుతుందన్నారు. చంద్రబాబు హయాంలో ఉమ్మడి రాష్ట్రం ఎంత అభివృద్ధి చెందిందో గమనించాలని కోరారు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టే దండుపాళ్యం గ్యాంగ్ తిరుగుతున్నదని, నియోజకవర్గంను చాలా ప్రమాదభరితంగా మారుస్తారని వీరి పట్ల చాలా జాగ్ర త్తగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో కొరిటాల లీలాసత్యసాయి, అచ్చన వెంకటేశ్వరరావు, బాలాజీ, గొట్టిపాటి గంగాధర్, యలవర్తి బ్రహ్మానందం, సాంబశివరావు, గ్రేస్ ఫౌండేషన్ అధ్యక్షులు షాలేంరాజు తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలి

● మాజీ మంత్రి, నియోజకవర్గ కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు

భట్టిప్రోలు, ఏప్రిల్ 14: కూటమి అభ్యర్థులను గెలిపించుకోవడం ద్వారానే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని కూటమి అభ్యర్థుల గెలుపునకు సమన్వయంతో కృషి చేయాలని మాజీ మంత్రి, నియోజకవర్గ కూటమి అభ్యర్థి నక్కా ఆనంద బాబు అన్నారు. భట్టిప్రోలులో వివిధ సామాజిక వర్గాల నుంచి 160 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆనందబాబు టీడీపీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో తూనుగుంట్ల సాయిబాబా, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేస్తాం

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌ను ఏర్పా టు చేసి అండగా ఉంటామని నక్కా ఆనందబాబు తెలియజేశారు. విశ్వబ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఆనందబా బు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ సంఘీయులు ఎదుర్కొంటున్న సమస్యలు అధి ష్టానం దృష్టిలో ఉన్నాయన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేయించేందుకు కృషి చేస్తానన్నారు. కొల్లూరు, వెల్లటూరు గ్రామాల్లో దేవస్థానం, కల్యాణమండపాల నిర్మించుకునేందుకు సహాయ సహకా రాలు అందిస్తామని ఆయన హామీనిచ్చారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కి అండదండలు అందించాలని ఆనందబాబు కోరారు. కమ్యూనిటీహాలు నిర్మాణా లకు స్థలాలు కేటాయించాలని, వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం నిర్మాణం, విశ్వ బ్రాహ్మణ శ్మశానికి స్థలం కేటాయింపు, చుండూరు మండలంలో గతంలో ఇచ్చిన రుద్రభూమి అన్యాక్రాంతమైందని, స్థలం సర్వే చేయించి ప్రహరీ నిర్మాణం చేయిం చాలని తదితర డిమాండ్లతో భట్టిప్రోలు, కొల్లూరు, వేమూరు, చుండూరు, అమర్త లూరు మండలాలకు చెందిన విశ్వబ్రాహ్మణ సంఘీయులు ఆనందబాబుకు విన తిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో తూనుగుంట్ల సాయిబాబా, సంఘీయులు చోడవరపు రామకృష్ణ, కె.జగదీష్, సుధాకర్, శ్యామసుందరరావు, సత్యనారాయణ, సీహెచ్ శ్రీనివాసరావు, వెంకట సుధాకర్, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ అసమర్థ పాలనలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం

చుండూరు ఏప్రిల్ 14: ఈ ఐదు సంవత్సరాల జగన్ పాలనలో అన్ని వ్యవ స్థలు నిర్వీర్యమయ్యాయని నక్కా ఆనందబాబు తనయు డు అఖిలేష్ పేర్కొన్నా రు. ఆదివారం నడిగడ్డపాలెంలో సూపర్ 6 పథకాలపై ఇంటింటి ప్రచారం ని ర్వహించా రు. జగన్ పాలనలో గ్రామీణాభివృద్ధి పూర్తిగా ధ్వంసమైందని, పం చాయతీకి సంబంధించిన నిధులను కూడా సొంతానికి వాడుకుని గ్రామాలను అ భివృద్ధికి దూ రం చేశాడని తెలిపారు. రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడంలో ఘోరంగా విఫలమైందన్నారు. గ్రామీణ యువత ఉపాధి అవ కాశాలు లేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. టీడీపీ ఓటు వేయ డం ద్వారా తిరిగి రాష్ట్రానికి పునఃజ్జీవనం కల్పిద్దామని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ బాప ట్ల పార్లమెంటరీ కమిటీ ఉపాధ్యక్షుడు తమ్మా శివారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గూడేటి ఎల్లారెడ్డి, రాఘవ, కొండయ్య, రఘునాథ్, బాబు, సువర్ణరావు, అగ్బర్, అన్వర్‌బాషా, సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర వ్యవస్థల దుర్వినియోగంతో కేజ్రీవాల్ అరెస్టు

● సమాజ్‌వాదిపార్టీ జిల్లా అధ్యక్షుడు మేదా శ్రీనివాసరావు

బాపట్ల, ఏప్రిల్ 14: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుకు కేంద్ర వ్యవస్థలను దుర్వినియోగం చేశారని సమాజ్‌వాది పార్టీ జిల్లా అధ్యక్షుడు మేదా శ్రీనివాసరావు ఆరోపించారు. ఇండియా కూటమి ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి సందర్భంగా బాపట్ల రైల్వేస్టేషన్ కూడలిలో ఆదివారం నిరసన కార్యక్రమాన్ని చేప ట్టారు. పంజాబ్, ఢిల్లీ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ఆప్‌పార్టీ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసి ఆపార్టీ ఎన్నికలకు సరిగ్గా సమాయత్తం కాకుండా దుర్మా ర్గం చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గంటా అంజిబాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్. గంగయ్య సీపీఐ కార్యదర్శి జేబీ శ్రీ ధర్, కాంగ్రెస్ మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు పఠాన్ రాజేష్, పట్టణ అధ్యక్షుడు దోనే పూడి దేవరాజు, మహిళా అధ్యక్షురాలు దండు రేణుక, సీపీఎం సీనియర్ నాయకు లు, సమాజ్‌వాదిపార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ఎదుగుదలకు సహకరించిన వారికే మద్దతు

● ముస్లిం ఐక్యవేదిక రాష్ట్రప్రధాన కార్యదర్శి అబ్దుల్ కలాం

బాపట్ల, ఏప్రిల్ 14 : ముస్లింల అభ్యున్నతి, రాజకీయ ఎదుగుదలకు సహకరిం చిన పార్టీలకే మద్దతునివ్వాలని ముస్లిం ఐక్యవేదిక రాష్ట్రప్రధాన కార్యదర్శి అబ్దుల్ కలాం తెలిపారు. బాపట్ల సాయిప్యాలెస్‌లో ఆదివారం ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి అబ్దుల్ కలాం ముఖ్యఅతిథి గా పాల్గొని రాబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పలు తీర్మానాలు చేశారు. ముస్లింల అభ్యున్నతి, రాజకీయ చైతన్యం గురించి ఐక్యవేదిక ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రం లోని ప్రతి నియోజకవర్గంలో ముస్లిం ఓటర్లు 5వేలకు పైగా ఉన్నారన్నారు. 15 నియోజకవర్గాలలో ముస్లింలకు టిక్కెట్లు కేటాయించిన పార్టీలకు మద్దతు తెలియజేయాలన్నారు. మిగిలినచోట్ల ఇండియాకూటమికి మద్ద తుగా నిలవాలన్నారు. సమావేశంలో అధికారప్రతినిధి ఖలీల్, అజీస్, జాయింట్ సెక్రటరి నూరు, జిల్లా అధ్యక్షుడు మౌలాబేగ్, ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు యువత నడుంబిగించాలి

● మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

● వాడవాడలా అంబేద్కర్ జయంతి వేడుకలు



అద్దేపల్లిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి ఆనందబాబు

భట్టిప్రోలు, ఏప్రిల్ 14: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు యువత నడుంబిగించాలని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పిలుపునిచ్చారు. అంబేద్కర్ జయంతి వేడుకలను ఆది వారం మండలంలో ఘనంగా నిర్వహించారు. అద్దేపల్లి లోని అంబేద్కర్ విగ్రహానికి, స్థానిక టీడీపీ కార్యాల యంలో అంబేద్కర్ చిత్రపటానికి ఆనందబాబు పూల మాల వేసి నివాళులర్పించారు. వెల్లటూరులో గల అంబేద్కర్ విగ్రహానికి, పల్లెకోనలో అంబేద్కర్ చిత్రపటా నికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్ర పటానికి తహసీల్దార్ మునిలక్ష్మి, వీర్వోలు, వీఆర్ఏలు సిబ్బంది పాల్గొ న్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అంబేద్కర్ చిత్రపటానికి ఎస్ఐ కె.శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా గ్రామా ల్లోని అంబేద్కర్ యూత్ ఆధ్వ ర్యంలో గ్రామ వీధుల్లో ర్యాలీలు నిర్వ హించి నివాళి అర్పించారు.

వేమూరు, ఏప్రిల్ 14: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో ప్రజా స్వామ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నక్కా ఆనందబా బు తెలిపారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకు ని మండ లంలోని జంపని గ్రామంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. వేమూరులో నిర్వహించిన కార్యక్ర మంలో జొన్నలగడ్డ విజయ బాబు పాల్గొని ప్రసంగించారు.

అమృతలూరు, ఏప్రిల్ 14: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు అంబేద్కర్ యూత్ అధ్వర్యంతో పూలమా లలు వేసి నివాళి అర్పించారు. టీడీపీ మండల కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

కొల్లూరు, ఏప్రిల్ 14 : కొల్లూరు ఎస్సీ కాలనీలోని అంబేద్కర్ విగ్రహా నికి టీడీపీ మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, జనసేన పార్టీ నాయకులు సమ్మెట దుర్గాప్రసాద్, ఆయా పార్టీల నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం ఆధ్వర్యంలో ఇండియా కూ టమి అభ్యర్థి బురగా సుబ్బారావు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రజాస్వామ్య విలువలు ప్రపంచానికి చాటి చెప్పిన అంబేద్కర్

● కూటమి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ



బాపట్లలో అంబేద్కర్ పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న వేగేశన నరేంద్రవర్మ, తెన్నేటి కృష్ణప్రసాద్ తదితరులు

బాపట్ల, ఏప్రిల్ 14: ప్రజాస్వామ్య విలువలను ప్రపంచానికి చాటిచె ప్పిన ఘనత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు దక్కుతుందని టీడీపీ, జనసే న, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ పేర్కొన్నారు. అంబేద్కర్ జయంతి కార్యక్రమాన్ని ఆదివారం బాపట్ల అంబేద్కర్ సర్కి ల్‌లో, మూర్తిరక్షణ్‌నగర్‌లో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన నిర్వహించా రు. అంబేద్కర్ పటానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావే శంలో నరేంద్రవర్మ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను కొనసాగి స్తామన్నారు. ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రాజ్యాం గం ద్వారా ఓటుహక్కు కల్పించినట్లు తెలిపారు. ఆ హక్కును కాపాడు కోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సమావేశంలో టీడీపీ పట్ట ణాధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, దగ్గుమల్లి కిరణ్‌కుమార్, మందపాటి ఆంద్రేయ, తానికొండ దయాబాబు, రాజశేఖర్, పల్లంసరో జనీ, దగ్గుమల్లి రాణి, కూచిపూడి ఝాన్సీరాణి తదితరులు ఉన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో అంబేద్కర్ పటానికి అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్ అధికారు లతో కలిసి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ ఇన్‌స్పె క్టర్ బాలమురళీకృష్ణ, వెల్ఫేర్ ఆర్ఐ డి.శ్రీనివాసరెడ్డి, పోలీసు అధికా రులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

బాపట్ల బార్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలను ఆదివారం అత్యంత ఘనంగా నిర్వహిం చారు. కోర్టు ప్రాంగణంలో అంబేద్కర్ పటానికి పుష్పాంజలి ఘటించి రైల్వేస్టే షన్ ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహా నికి న్యాయవాదులతో కలిసి బార్‌అసో సియేషన్ అధ్యక్షులు విన్నకోట సత్యప్ర సాద్ పుష్పాంజలి ఘటించారు. కార్యక్ర మంలో న్యాయవాదులు సి.ప్రేమచంద్, కె.రవిబాబు, యాతం సతీష్‌రాజా, వైన రేష్‌బాబు, తోట రామాంజనేయులు, కత్తి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

బీజేపీ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహా నికి పట్టణపార్టీ అధ్యక్షుడు మామిడి రమేష్‌కుమార్ పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర సభ్యులు బత్తుల ఆనంద్‌కుమార్, శ్రీనివాసరాజు, మణియాదవ్, బాలనారాయ ణ, శ్రీనివాసులు, నాళం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి : జేడీ శీలం

ప్రపంచదేశాలకు ఆదర్శంగా ఉన్న భారతరాజ్యాంగాన్ని కాపాడుకో వాల్సిన బాధ్యత అందరిపై ఉందని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జేడీ శీలం అన్నారు. బాపట్ల అంబేద్కర్ సర్కిల్‌లో అంబే ద్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబా బు, మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు ప ఠాన్ రాజేష్, నాయకులు చింతాబాబూ రావు, దోనేపూడి దేవరాజు, దగ్గుమల్లి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● బాపట్ల వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ వి.శ్రీనివాస రావు అధ్యక్షతన అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. డాక్టర్ కె.రాధిక, డాక్టర్ ఎస్.ప్రతిభశ్రీ, డాక్టర్ విజయగోపాల్, బోధన, బోధనేత ర సిబ్బందితో కలిసి అంబేద్కర్ పటానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను కొనియాడారు. బాపట్ల ఏరువాక కేంద్రంలో కోఆర్డినేటర్ డాక్టర్ బాలమురళీధర్‌నాయక్ ఆధ్వ ర్యంలో అంబేద్కర్ జయంతి వేడు కలు నిర్వహించారు.

కర్లపాలెం, ఏప్రిల్ 14: మండలంలోని పలుగ్రామాల్లో ఆదివారం అంబేద్కర్ జయంతి వేడుకలను అంబేద్కర్ సేవాసమాజం నేతలు పలుశాఖల అధికారు లు, పలువురు ప్రజాప్రతినిధులు, విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 14 : మండలంలోని కోమలి గ్రామపంచా యతీలో ఆదివారం అంబేద్కర్ జయంతి వేడుకలను టీడీపీ, జనసేన, బీజేపీ, వైసీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహా నికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పిట్టలవానిపాలెం ఎంపీడీవో కార్యాలయం నందు గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాని కి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అంబేద్కర్ సేవా సంఘం నాయకులు పాల్గొని పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

రేపల్లె నియోజకవర్గంలో..

రేపల్లె, ఏప్రిల్ 14: నియోజకవర్గంలోని రేపల్లె, నగరం, నిజాంప ట్నం, చెరుకుపల్లి మండలాల్లో టీడీపీ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కూచినపూడి సెంటర్లో, రేపల్లె పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, జీవీ నాగేశ్వరరావు, దామెర్ల రాజారావు, ఆలూరి డానియేల్, కనుకుర్తి సంగీత్, బీజేపీ నాయకులు పిన్ని సాంబశివరావు, కృష్ణ ప్రసాద్, తదిత రులు పాల్గొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు అన్నం సాయి, పిన్ని సాంబశివరావు, వెంకటేశ్వరరావు తదితరులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రేపల్లె బార్ అసోసియేషన్ హాల్లో అధ్యక్షులు కేసన వెంకట గోపాలరావు ఆధ్వ ర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.



రేపల్లెలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

రానున్నది ఎన్డీయే కూటమి ప్రభుత్వమే

● అనగాని గెలుపు కోసం కృషి చేయాలి : శివప్రసాద్



రాంబొట్లవారిపాలెం సమీపంలో తెలుగు ప్రొఫెషనల్ వింగ్ ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్

రేపల్లె, ఏప్రిల్ 14: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అనగాని గెలుపుకోసం విస్తృత ప్రచారం చేసి అండగా నిలవాలని ఎమ్మెల్యే సో దరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. ఆదివారం చెరుకుపల్లి మండ లంలోని రాంబొట్లవారిపాలెంలో తెలుగు ప్రొఫెషనల్ వింగ్ ఆధ్వర్యం లో సైకిల్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ 5 ఏళ్ళ పాలనలో జగన్‌రెడ్డి చేసిన అవినీతి, అక్రమాలను ప్రజ ల్లోకి తీసుకువెళ్లాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో అవినీతి, అక్ర మాలు దౌర్జన్యాలు పెరిగిపోయాయని, పేద మధ్యతరగతి కుటుంబా ల వారు బతికే పరిస్థితి లేదన్నారు. తెలుగు ప్రొఫెషనల్ వింగ్ సభ్యు లు గ్రామాల్లో ప్రచారం నిర్వహించి అనగాని గెలుపు కోసం కృషిచే యాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాతా ఏడుకొండలు, పూషడపు కుమారస్వామి, కేసన రామకృష్ణ, నిజాంపట్నం జడ్పీటీసీ న ర్రా సుబ్బయ్య, టీపీడబ్ల్యూ సభ్యులు నరేంద్ర, కళ్యాణరామ్, నాగబా బు, రామారావు, శ్రీనివాస్, సునీల్, బార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ రూ.4 వేలకు పెంపు

● ప్రతి ఇంటికి ఫించన్‌ను తామే అందిస్తాం

● రాష్ట్రాభివృద్ధి ఎన్డీఏ కూటమితోనే సాధ్యం

రేపల్లె, ఏప్రిల్ 14: రాష్ట్రాభివృద్ధి చెందాలన్నా పేద, మధ్యతరగతి కుటుంబాల వారు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా బతకాలన్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే విధంగా మీమద్దతు తెలపాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు గోగినేని పట్టాభిరా మారావు అన్నారు. ఆదివారం పట్టణంలోని 5, 7, 8 వార్డుల్లో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ గెలుపు కోసం ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను కలుస్తూ ఆప్యాయంగా పలకరిస్తూ రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి అనగానికి, ఎంపీ అభ్యర్థి కృష్ణప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ళ వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలు చెందిందని సంక్షేమ పథకాల పేరుతో పేద, మధ్యతర గతి కుటుం బాలవారిపై వివిద రకాల పన్నుల భారం పెంచటంతో అధిక భారం పడిందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మీరంతా మాకు అండగా నిలవాలన్నారు. వైసీపీ అవినీతి అరాచక ప్రభు త్వం బుద్ధి చెప్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, నాయకులు గుర్రం మురహరిరావు, డొక్కు బుజ్జి, వెని గళ్ళ సుబ్రహ్మణ్యం, చెన్ను నాగమల్లేశ్వరరావు, వి.ధర్మారావు, జడల రాజు, దేవగిరి రంగా, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీబండ్లమ్మవారు ప్రతిష్ఠ వార్షికోత్సవాలు



శ్రీబండ్లమ్మ అమ్మవారు

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 14: పిట్టలవానిపాలెంలో ఉన్న గ్రామదేవత శ్రీబండ్లమ్మవారు ప్రతిష్ఠ వార్షికోత్సవాలను ఆదివారం ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శ్రీబండ్లమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కుబడులు తీర్చు కున్నారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రచారంలో వలంటీర్లు



ఎమ్మెల్యే కోనతో ప్రచారంలో పాల్గొన్న జిల్లెళ్ళమూడి గ్రామ వలంటీర్లు పర్విన, దీప్తి

బాపట్లరూరల్, ఏప్రిల్ 14: బాపట్ల మండలం జిల్లెళ్ళమూడిలో బాపట్ల వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కోన రఘుపతి నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆగ్రామ వలంటీర్లు అయిన పర్విన, దీప్తిలు ఎన్నికలకోడ్‌ను ఉల్లంఘించి ప్రచారంలో పాల్గొన్నారు. ప్రచారరథంలో ఎమ్మెల్యేతో కలిసి నిలబడ్డారు. ఈ వలంటీర్లపై అధికారులకు స్థానిక నేతలు ఫిర్యాదులు చేశారు. వీరిపై ఎలక్షన్ క మిషన్ చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు.

చట్టబద్ధమైన గ్రామసభలు జరపాలి : ఎంపీడీవో

వేమూరు, ఏప్రిల్ 14 : ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో చట్ట బద్ధమైన గ్రామసభలను వారంలోగా ఏర్పాటు చేయాలని ఎంపీడీవో శేషగిరిరావు కార్యదర్శులను ఆదేశించారు. ఆదివారం ఆయన మండ ల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పా టు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాధారణ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్నప్పటికీ వారం రోజుల్లోగా చట్టబద్ద గ్రామసభలను తప్పనిసరిగా నిర్వహించాలని అన్నారు. ఎలక్షన్ మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్‌ను దృష్టిలో పెట్టుకుని సభలు నిర్వహించాలన్నారు. ఓటర్లను ప్రభావితం చేసే అంశాలను సభల్లో చర్చించకూడదు. ఓటింగ్ శాతం పెరగడానికి పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు.

జీవన విధానాన్ని తెలిపేది రామాయణం

● టీటీడీ ఉపన్యాసకులు శ్రీనివాసశర్మ

వేమూరు, ఏప్రిల్ 14 : శ్రీమద్రామాయణం జీవన విధానాన్ని తె లియజేస్తుందని టీటీడీ ఉపన్యాసకులు కూచిభట్ల శ్రీనివాసశర్మ అన్నారు. మండలంలోని అబ్బనగూడవల్లిలో టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో వ సంత నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు.

ఓటమి భయంతోనే రౌడీమూక దౌర్జన్యం

● టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల, ఏప్రిల్ 14 : ఓటమి భయంతోనే వైసీపీ శ్రేణులు కవ్వింపు చర్యలకు పాల్పడటంతోపాటు దళితులు, దళిత మహిళలు, టీడీపీ శ్రేణులపై దౌర్జన్యం చేశా రని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ పేర్కొ న్నారు. టీడీపీ నాయకులు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి వేడుకలు శాంతియుతంగా జరుగుతున్న సమయంలో పెద్దపెద్ద సౌండ్‌లు, ర్యాలీలు, బైక్‌లపై వచ్చిన వైసీపీ మూక తమపై దాడిచేయటం దారుణమన్నారు. ప్రజలను రెచ్చగొడుతూ భయభ్రాంతులకు గురి చేశారన్నారు. అంబేద్కర్ విగ్రహం ఎదుటే దౌర్జన్యం చేసి ప్రజాస్వామ్యాన్ని అప హాస్యం చేశారన్నారు. రౌడియిజం చేసి భయపెట్టాలని చూస్తున్నారన్నారు.

అల్లరిమూకల దాడిపై ఫిర్యాదు చేస్తాం : వేగేశన నరేంద్రవర్మ

ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తూ అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న తమపై వైసీపీ రౌడీలు ఎమ్మెల్యేను భుజాల మీద ఎత్తుకొని తమపై దౌర్జన్యం చేయటంపై ఎన్నికల కమిషన్, పోలీసులు, ఆర్వోకు ఫిర్యాదు చేస్తామని కూటమి ఎమ్మెల్యే అ భ్యర్థి వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. తాము జయంతి వేడుకలు జరుపుతున్నా మని తెలుసుకొని ఎప్పుడు రాని చోటకు వచ్చి ఉద్దేశపూర్వకంగానే టీడీపీ శ్రేణు లను నెట్టివేయటం, మహిళలను లాగివేయటం దారుణమన్నారు.

టీడీపీ శ్రేణులు మాట్లాడే సమయంలో ఎమ్మెల్యే కోన తన అనుచరులతో వచ్చి దౌర్జన్యం చేయడాన్ని ఖండిస్తున్నామని అంబేద్కర్ సేవాసమాజం అధ్యక్షుడు దగ్గుమల్లి కిరణ్‌కుమార్ తెలిపారు. మహిళల చీరలు పట్టుకొని లాగి నెట్టివేశార న్నారు. ఏ దళితులైతే కోన రఘుపతిని గెలిపించారో అదే దళితులు ఆయనకు తగిన బుద్ధి చెప్పటం ఖాయమని టీడీపీ బాపట్ల పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ అన్నారు. ఈ సమావేశంలో జనసేన నియోజకవర్గ సమ న్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, దళిత నాయకులు మందపాటి ఆంద్రేయ, రాజశేఖర్, దండమూడి సంధ్యారాణి, దారా అశోక్‌లు పాల్గొన్నారు.

26మంది వైసీపీ శ్రేణులు టీడీపీలో చేరిక



బసివిరెడ్డిపాలెంకు చెందిన వైసీపీ నాయకులకు కండువా కప్పి టీడీపీలోకి చేర్చుకుంటున్న వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, ఏప్రిల్ 14: మండలంలోని బసివిరెడ్డిపాలెంకు చెందిన రెడ్డి సామాజిక వర్గ వైసీపీ శ్రేణులు 26మంది ఆదివారం తెలుగుదేశంపార్టీలో చేరారు. మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కావూరి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కూటమి ఎమ్మెల్యే అభ్య ర్థి వేగేశన నరేంద్రవర్మ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముదు గు వెంకటేశ్వరరెడ్డి, మరుప్రోలు వెంకటేశ్వరరెడ్డి, కోకి యలమందరెడ్డి, మరుప్రో లు యలమందారెడ్డి, కోకి ఉమా కోటిరెడ్డి, మంచాల కొండలురెడ్డి, కోకి అంజిరెడ్డి, కోకి తిరుపతి నాగరాజు, మున్నం వెంకటస్వామిరెడ్డి, కోకి లక్ష్మీనారాయణరెడ్డి, ఆట్ల ముత్యాలరెడ్డి, ఆసోది సురేష్‌రెడ్డి, కోకి బ్రహ్మరెడ్డి, మరుప్రోలు చందురెడ్డి, కోకి ఏడుకొండలురెడ్డి, మరుప్రోలు గోపిరెడ్డి, మున్నం విజయసింహారెడ్డి, మణికం ఠరెడ్డి, ముదుగు మణికంఠారెడ్డి, మున్నం సుబ్రహ్మణ్యంరెడ్డి, కోకి శివాజీరెడ్డి, మ రుప్రోలు శివదుర్గారెడ్డి, మరుప్రోలు వెంకటేశ్వరరెడ్డి, కోకి శ్రీనివాసరెడ్డి, మరుప్రోలు రామకోటిరెడ్డిలు టీడీపీలో చేరారు.

వైసీపీ ప్రచారంలో పాల్గొన్న పారిశుధ్య కార్మికుడు



వైసీపీ ప్రచారంలో పాల్గొన్న మున్సిపల్ పారిశుధ్య కార్మికుడు చిత్రాల ఓబేదు

రేపల్లె, ఏప్రిల్ 14 : వైసీపీలో ఓ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్‌గా పదవిని అనుభవిస్తూ మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికుడిగా నిబంధనలకు విరుద్ధంగా రికార్డుల్లో పట్టణానికి చెందిన చిత్రాల ఓబేదు పేరు నమోదు చేసుకుని అధికార పార్టీ నాయకుల అండదండలతో విధులు నిర్వహించకుండానే నెలకు అక్షరాల రూ.21వేలు జీతం తీసుకుంటూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తు వైసీపీ సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నాడని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ రాష్ట్ర ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. ఇలాంటి వ్యక్తికి ఎన్నికల నిబంధనలు పాటించవా అని ఇటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ కా ర్యాలయంలో చిత్రాల ఓబేదు అనే అతను పారిశుధ్య కార్మికుడిగా విధులు నిర్వ హించకుండా నాలుగు సంవత్సరాల నుంచి పురపాలకసంఘ కార్యాలయం నుం చి ప్రతి నెలా రూ.21వేలు జీతం తీసుకుంటున్నాడని మున్సిపల్ శాఖాధికారులు విధులు నిర్వహించని వ్యక్తికి ప్రజాధనాన్ని జీతాల రూపంలో ఎలా ఇస్తారని ప్రశ్నించారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి విచారణ జరిపి వెంటనే విధుల నుంచి తొలగించి, ఇందుకు సహకరించిన మున్సిపల్ అధికారులపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

చంద్రబాబు పాలనతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం

● టీడీపీ అధికార ప్రతినిధి విజయబాబు



బేతాళపురం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న టీడీపీ అధికార ప్రతినిధి విజయబాబు

వేమూరు, ఏప్రిల్ 14 : రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితే నే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు తెలిపారు. ఆదివారం ఆయన వేమూరు పంచాయతీ పరిధిలోని బేతాళపురం, ఇస్లాంపేటలో పర్యటించారు. ఇంటింటికి తిరిగి మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కూటమి అసెంబ్లీ అభ్యర్థి నక్కా ఆనందబాబు, కూటమి లోక్‌సభ అభ్యర్థి కృష్ణప్రసాద్‌లను గెలిపిం చాలని కోరారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ద్వారా తిరిగి మంచి రోజులు వస్తాయని సంక్షేమంతో పాటు అభివృద్ధిని కూడా అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన వివిధ విభాగాల నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్టి పూజలు

భట్టిప్రోలు, ఏప్రిల్ 14: మండలంలోని సూరేపల్లి పంచాయతీ తాతావారిపాలెం రోడ్డులో కొలువైయున్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం షష్టి పూజలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి నైవేద్యం సమర్పించి మొక్కుబడులను చెల్లించారు. ఆదివారం రాత్రి ఆలయ ఆవరణలో భజన బృందాల ఆధ్వర్యంలో భక్తి గీతాలను ఆలపించారు.

పర్చూరులో వలసల జోరు

» వైసీపీ నుంచి టీడీపీలోకి క్యూకడుతున్న వైనం
» ఏలూరి సమక్షంలో పార్టీలోకి చేరుతున్న శ్రేణులు
» యద్దనపూడిలో సైకిల్ ఎక్కిన వైసీపీ నేతలు



ఏలూరి సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన ఏఎంసీ వైస్ చైర్మన్ రమేష్, పార్టీలో చేరిన వైసీపీ నాయకులతో ఏలూరి

పర్చూరు, ఏప్రిల్ 14 : యద్దనపూడి మండలంలోని వైసీపీ ప్రజా ప్రతినిధులు సీనియర్ నేతలు సైకిల్ ఎక్కారు. తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో వైసీపీ నేతలు భారీ ఎత్తున ఆదివారం తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఎమ్మెల్యే ఏలూరి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ప్రజాసేవే లక్ష్యంగా ప్రజకు అనునిత్యం అందుబాటులో ఉం టూ నిజయోజకాభివృద్ధికి కృషి చేస్తున్న ఏలూరికి ప్రజలకు పార్టీలకు అతీతంగా బ్రహ్మరథం పడుతున్నారు. దీంతో అధికార వైసీపీ నుంచి రోజు రోజుకు వలస జోరుతో పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొంది. ఇప్పటికే చినగంజాం మండల వ్యాప్తంగా అనేక గ్రా మాల నుంచి వేల సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలోకి చేరారు. తాజాగా యద్దనపూడి మండలానికి చెందిన వైసీపీ నేతలు పెద్ద ఎత్తున టీడీపీలోకి చేరడం రెండు మండలాల నుంచి అఖండ మెజార్టీ ఖాయమన్న ప్రచారం జోరుగా సాగుతుంది. పూనూరు సొసైటీ అధ్యక్షుడు పావూలూరు శ్రీనివాసరావు, యద్దనపూడి సొసైటీ అధ్యక్షుడు చింతపల్లిపాడుకు చెందిన వైసీపీ సీనియర్ నేత గోరంట్ల సాంబశివరావు, గన్నవరం ఎంపీటీసీ సభ్యుడు గొట్టిపాటి సతీష్ కుమార్, గన్నవరం వైసీపీ నేతలు నర్రా పాపారాయుడు, సోమేపల్లి స్వాములు, దగగుట్టూరు శ్రీధర్, నర్రా శ్రీనివాసరావు, చెరుకూరి నాగేశ్వరరావు, చెరుకూరి శ్రీహరిరావు, వేణుబాబు, సోమేపల్లి వీరాస్వామి, నర్రం వెంకటేశ్వర్లు, మున్నంగివారిపాలెం సీనియర్ నేత అనిల్ కుమార్‌తో పాటు పార్టీ శ్రేణులు టీడీపీలో చేరారు.

పూనూరుకు చెందిన సయ్యద్ ఉమ్మర్, షేక్.కాలేషా, షేక్ బాజీవలి, బాబు, షేక్.హుస్సేన్, షేక్ భూరాన్, సయ్యద్ బాలసైదా, మర్రిపాలెం సుబ్బారావు, కాకాని వీరాంజనేయులు టీడీపీలో చేరారు.

చెరుకూరు గ్రామంలోని వైసీపీ నేతలు ఎమ్మెల్యే ఏలూరి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. పార్టీలోకి చేరిన వారిలో షేక్ ఇమ్రాన్, షేక్ కరిముల్లా, షేక్ ఖాశీం, హజహాన్, షేక్ ముంజురుల్లా, షేక్ బుడా, షేక్ సుభానీ, బాజీ, నాగూర్, మహబూబ్ బాషా, పండు ఉన్నారు. పర్చూరుకు చెందిన వైసీపీ నాయకులు ఏఎంసీ వైస్ చైర్మన్ కృష్ణంశెట్టి రమేష్, కోటా మధుతో పాటు, గ్రామానికి చెందిన ఎస్టీ వాసులు టీడీపీలో చేరారు. వీరికి ఏలూరి సాంబశివరావు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నేత లు దూళిపల్లి వెంకటస్వామి, గడ్డిపాటి శ్రీనివాసరావు, కఠారి దుర్గా ఉన్నారు.

మార్టూరులో వైసీపీకి షాక్

టీడీపీలో చేరిన ఏఎంసీ మాజీ చైర్మన్, మాజీ సర్పంచ్

మార్టూరు : మండలంలోని రాజుపాలెం గ్రామానికి చెందిన జాష్టి బ్రదర్స్ వైసీపీని వీడి టీడీపీ చేరారు. వారంతా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో సైకిల్ ఎక్కారు. ఏఎంసీ మాజీ చైర్మన్ జాష్టి వెంకటనారాయణ (పెదబాబు) అతని భార్య, ఎంపీటీసీ సభ్యులు హేమలత, సోదరుడు మాజీ సర్పంచ్ జాష్టి గోపాల కృష్ణ (చినబాబు) సర్పంచ్ గర్నెపూడి కోటమ్మ తమ వర్గీయులతో వైసీపీకి గుడ్‌బై చెప్పారు. ఆదివారం జాష్టి వెంకట నారాయణ స్వగృహానికి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఏలూరి సాంబ శి వరావు వచ్చారు. ఆయనకు జాష్టి సోదరులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారిద్దరితోపాటు, వారి అనుచరులను పార్టీలోకి ఆహ్వానిస్తూ ఏలూరి కండువాలను వేశారు. వాస్తవంగా వైసీపీలో ఉన్న జాష్టి వెంకటనారాయణ కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు కుటుంబానికి సన్నిహితుడిగా ఉన్న వెంకటనారాయణ వైసీపీ నుంచి దగ్గుబాటి వైదొలిగిన తర్వాత స్తబ్దతగా ఉన్నారు. దగ్గుబాటి కుటుంబంతో సాన్నిహిత్యం, ఎమ్మెల్యే గొట్టిపాటితో ఉన్న పరిచయాల మేరకు ఏలూరికి మద్దతుగా పార్టీలో చేరినట్లు జాష్టి చెప్పారు. వారితోపాటు ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొమెర వెంకటేశ్వర్లు, పంచాయతీ మెంబర్లు కొమెరవల్లి చిన్నబ్బాయి. చాటగడ్డ బ్రహ్మదేవి, గోపతోటి వెంకటేశ్వర్లు, నల్లపనేని రంగారావు, నాగండ్ల దేవి, తాటి లక్ష్మి, బండి సుబ్బాయమ్మ, తన్నీరు మహాలక్ష్మి, గోపతోటి నాగేశ్వరరావుతో పలు కుటుంబాలు చేరారు.


ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరిన జాష్టి బ్రదర్స్

మార్టూరు మాజీ సర్పంచ్ పార్టీలో చేరిక

మార్టూరు మాజీ సర్పంచ్ కేశావతు దేవుని దయానాయక్ తన వర్గీయులతో ఆదివారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయంలో ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరారు. ఆ యనతో పాటు కిలావతు చంద్రలాల్, భుఖ్యా లోక్ నాయక్, కిలావతు చందునాయక్, భూక్యా హనుమానాయక్, భూక్యా సుబ్బారావు నాయక్, మాడావతు నాగేశ్వరరావు నాయక్ తదితరులు పార్టీలో చేరారు. అదేవిధంగా మార్టూరులోని మైనారిటీలు మహమ్మద్ అయ్యాజ్, షేక్ రియాజ్, మాబు సుభాని, షేక్ కాలేషావలి, ముల్లా అషాద్, పఠాన్ జానీ బాషా పార్టీలో చేరారు.


ప్రచారం నిర్వహిస్తున్న దారు నాయక్

గిరిజన ద్రోహి జగన్

టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారు నాయక్

అడుసుమల్లి(పర్చూరు), ఏప్రిల్ 14: గిరిజన ద్రోహి జగన్‌రెడ్డి అని తెలుగుదేశం పార్టీ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు దారు నాయక్ అన్నారు. పర్చూరు మండలం అడుసుమల్లి, భూషాయపాలెం గ్రామాల్లోని తాండాలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి తాండా వాసులను సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమాన్ని జగన్‌రెడ్డి విస్మరించారన్నారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీనివాసరావు, బాపట్ల పార్లమెంట్ నాయకుడు ఇండ్ల శ్రీనివాసరావు, పర్చూరు నియోజకవర్గ నాయకులు పాలపర్తి శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కారుమంచి కృష్ణ, మండలపార్టీ అధ్యక్షుడు షేక్ షంషుద్దీన్, మక్కెన శేఖర్ బాబు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

మేదరమెట్ల, ఏప్రిల్ 14 : ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రజలంతా సహకరించాలని కొరిశపాడు ఎస్ఐ శివయ్య తెలిపారు. ఆదివారం మండలంలోని రాచపూడి, పమిడిపాడు గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల సందర్భంగా ఎటువంటి ఘర్షణలు, గొడవలు చేసినా రౌడీషీట్ తెరుస్తామన్నారు. సభలు, సమావేశాల నిర్వహణ, మైకులు పెట్టుకోవడానికి ముందుగా అనుమతి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.


బీసీలనుద్దేశించి మాట్లాడుతున్న ఏలూరి

టీడీపీలోకి బీసీలంతా రావాలి

ఏలూరి పిలుపు

మార్టూరు, ఏప్రిల్ 14 : బీసీల ఆత్మ గౌరవానికి విలువనిచ్చే తెలుగుదేశం పార్టీలోకి రావాలని బీసీ కుటుంబాలకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి మార్టూరులో జయహో బీసీ కార్యక్రమం జరిగింది. బీసీ రాష్ట్ర నాయకుడు గుంజి వెంకట్రావు అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా ఏలూరి మాట్లాడారు. టీడీపీ ఆవిర్భావం తర్వాత బీసీలకు రాజకీయంగా, సామాజికంగా గుర్తింపు వచ్చిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే బీసీ రక్షణ చట్టాన్ని అమలు చేసి, అండగా ఉంటామన్నారు. జగన్‌రెడ్డిపై రాయి దాడి కుట్రలో భాగమన్నారు. నాడు కోడి కత్తి.. నేడు రాయి డ్రామాతో మరో అమాయకుడిని బలిపశువును చేసేందుకు వ్యూహం పన్నారన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల కోసం పాటు పడే ప్రభుత్వానికి ప్రజలు మద్దతు ఇవ్వాలన్నారు. గౌరవం లేని చోట ఉండవద్దన్నారు. ప్రజల ఆత్మ గౌరవానికి విలువ నిచ్చే చంద్రబాబు పాలనకు ప్రజలు మద్దతు ఇవ్వాలన్నారు. పర్చూరు నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు మీరిచ్చే విజయంతో దుర్మార్గ పాలన అంతం కావాలన్నారు. కార్యక్రమంలో గుంజి వెంకట్రావు, శివరాత్రి శ్రీను, పోలూరి సింగయ్య, ఉప్పు గురవయ్య, పల్లపు అంకమ్మ రావు, మండల నాయకులు కామినేని జనార్దన్, షేక్ రజాక్, తాటి నాగేశ్వరావు, మహిళా నేతలు రమాదేవి, రాధ పాల్గొన్నారు.

టీడీపీలో చేరికల జోష్

చినగంజాం : చినగంజాం మండలంలో టీడీపీలో చేరికలు జోష్‌గా కొనసాగుతున్నాయి. చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని వైసీపీకి చెందిన వార్డు మెంబర్లు, మసీదుపేట, అంబేడ్కర్‌నగర్‌కు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీ వార్డు మెంబరు షేక్ నబీషా ఆధ్వర్యంలో వార్డు మెంబర్లు గేరా ఆషా, మార్పు సుకుమార్, మసీదుపేట, అంబేద్కర్‌నగర్‌లకు చెందిన 40 కుటుంబాలకు చెందిన ముస్లింలు, ఎస్సీలు పార్టీలో చేరగా ఎమ్మెల్యే ఏలూరి వారికి కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సయ్యద్ అబ్దుల్‌కలాం అజాద్, షేక్ ఖాదర్ బాషా, షేక్ సలాం పాల్గొన్నారు.


వైసీపీని వీడి టీడీపీలో చేరిన పరిటాలవారిపాలెంవాసులు

రాక్షస పాలనలో బీసీలపై పెరిగిన దాడులు

ఎమ్మెల్యే గొట్టిపాటి

సంతమాగులూరు, ఏప్రిల్ 14 : వైసీపీ రాక్షస పాలనలో బీసీపై దాడులు పెరిగాయని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఆరోపించారు. సంతమాగులూరు మండలంలోని పరిటావారిపాలెం గ్రామంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన 30 కుటుంబాలకు చెందిన పుట్టా రామాంజీ,గుంటూరు హనుమంతరావు గుంటూరు రవి, చెవుల చంద్రయ్య, పాత కోట రమజాన్, యేసు దానం, నూకల అంకమ్మారావు, చిలువేరి వేంకటేశ్వర్లు, నూకల వీరయ్య, కుందుర్తి మొగలయ్య, చిలువేరి వీరంజి, గుంటూరు ప్రసన్న, బోదడ శ్రీనివాసరావు, కమతం వీగయ్య, కుందుర్తి చిన అంజయ్య కమతం రవి, బుల్లయ్య, బడుగు ఇసాక్, నూకల వీరంజీ, కుందుర్తి ఆంజనేయులు, కందుల వేంకటేశ్వర్లు, పాత కోట ఆంజనేయులు, నూకల శ్రీను వైసీపీని వీడి ఎమ్మెల్యే గొట్టిపాటి సమక్షంలో టీడీపీ చేరారు.

ఉచిత బస్సు ప్రయాణం.. మూడు గ్యాస్ సిలిండర్లు

హర్షవర్ధన్ ఇంటింటి ప్రచారం


ప్రచారం చేస్తున్న హర్షవర్ధన్

సంతమాగులూరు : ఎన్డీయే కూటమి అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందజేస్తుందని కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ తనయుడు గొట్టిపాటి హర్షవర్ధన్ ప్రజలకు వివరించారు. సంతమాగులూరు మండలం సజ్జాపురంలో ఉమ్మడి కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్‌కు మద్దతుగా తనయుడు ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి స్థానిక ప్రజలతో ముచ్చటించిన ఆయన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ మేనిఫెస్టో అంశాలను ప్రజలకు వివరించి, ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహాశక్తి పథకం ద్వారా మహిళలకు ఏటా ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామన్నారు. ఆడబిడ్డ నిధి ద్వారా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఆడబిడ్డకు ప్రతినెలా రూ.1500, తల్లికి వందనం ద్వారా ప్రతి ఇంటిలో ఎంతమంది పిల్లలు చదువుకుంటే వారందరికీ ఒక్కొక్కరికి రూ.15 వేలు అందజేస్తారని తెలిపారు. వచ్చే నెల 13న జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి కూటమి ఎమ్మెల్యే. ఎంపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గాడిపర్తి వెంకట్రావు, దూపాటి ఏసోబు, తేలప్రోలు రమేష్, చేవూరి వాసిరెడ్డి, కంచేటి మురళి, గంద్రు అంకమ్మరావు, గొట్టిపాటి అజయ్, గంద్రు గోవిందు, గడిపూడి శేషయ్య పాల్గొన్నారు.

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి

యువనేత కమల్‌కిషోర్ ఇంటింటి ప్రచారం


ముక్తేశ్వర్యంలో ప్రచారం నిర్వహిస్తున్న బాబీ

బల్లికురవ, ఏప్రిల్ 14 : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే గ్రామాలలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు సకాలంలో అమలు జరుగుతాయని నియెజకవర్గ యువనేత గొట్టిపాటి కమల్‌కిషోర్ (బాబీ) అన్నారు. ఆదివారం మండలంలోని ముక్తేశ్వరం గ్రామంలో ఎమ్మెల్యే రవికుమార్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన ఇంటింటికీ తిరిగి టీడీపీ ప్రవేశ పెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. బీసీలకు 50 ఏళ్లకు పింఛన్ ఇవ్వనున్నట్లు చెప్పారు. అలాగే రూ.4వేలకు పింఛన్ పెంచుతున్నట్లు తెలిపారు. నిరుద్యోగులను ఆదుకోవడంతోపాటు అన్నివర్గాల ప్రజలు ఆర్థికంగా బలపడేలా పథకాలను రూపొందించారని వివరించారు. సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కొండేటి ఇజ్రాయల్, అట్లూరి నాగేశ్వరరావు, శింగంశెట్టి సుబ్బారావు, చెన్నూరి నాగార్జున, ప్రసాద్, నాగండ్ల హనుమంతురావు, అడపాల బసవయ్య, బైలడుగు శివయ్య, కోటయ్య, వెంకటేశ్వరరావు, నాగి శెట్టి చిరంజివి పాల్గొన్నారు.

వీఆర్వో కుటుంబానికి ఆర్థిక సాయం

యద్దనపూడి, (మార్టూరు) ఏప్రిల్ 14 : యద్దనపూడి మండలంలోని జాగర్లమూడి వీఆర్వో కాలేషావలి విధి నిర్వహణలో గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. అతని కుటుంబానికి కలెక్టరు పంపిన రూ.2లక్షల ఆర్థిక సాయం చెక్కును ఆదివారం ఆర్డీవో గంధం రవీందర్ కాలేషావలి కుటుంబ సభ్యులకు అందజేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దాం




చీరాల, మార్టూరు, మేదరమెట్లలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ కూటమి అభ్యర్థులు కొండయ్య, ఏలూరి, గొట్టిపాటి

పలువురు వక్తల ఉద్ఘాటన.. నివాళి

చీరాల, ఏప్రిల్ 14 : భారత రాజ్యంగ నిర్మాత, బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దామని పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పిలునిచ్చారు. ఆదివారం అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో ముక్కోణపు పార్క్ సెంటర్లోని అంబేడ్కర్ విగ్రహానికి రాజకీయపార్టీలు, ప్రజాసంఘాల ప్రతినిధులు పూలమాలలువేసి నివాళులర్పించారు.

ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో

ఎన్డీఏ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు తెన్నేటి కృష్ణప్రసాద్, ఎంఎం కొండయ్య, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రా జ్యాంగపరమైన హక్కులను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉందన్నా రు. అందుకు అనుగుణంగా చైతన్యవంతులు కావాలన్నారు. అనంతరం ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు నాతాని ఉమామహేశ్వరరావు, సజ్జా వెంకటేశ్వరరావు, పార్టీల నాయకలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏలూరి నివాళి

మార్టూరు : నేతాజీనగర్, రామ్‌నగర్ కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ కూటమి అభ్యర్థి ఏలూరి సాంబశివరావు శ్రేణులతో కలిసి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయనవెంట గొట్టిపాటి వెంకట్రావు, కామినేని జనార్దన్, తొండెపు ఆదినారాయణ, కమ్మ శివ నాగేశ్వరరావు, రాంబాబు, తాటి నాగేశ్వరావు, షేక్ రజాక్ అంబేడ్కర్‌కు ఘన నివాళులర్పించారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జేడీ శీలం, ఏలూరి కొద్దిసేపు అప్యాయంగా మాట్లాడుకున్నారు. జేడీ అంబేడ్కర్‌కు నివాళులర్పించి వెళ్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న ఏలూరిని చూసి పలుకరించారు. అదే సమయంలో అక్కడకు వచ్చిన కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శివసాయిశ్రీలక్ష్మీ జ్యోతి అందరూ ఉండడం చూసి కారు దిగకుండానే వెళ్లిపోయారు.

మేదరమెట్లలో..

మేదరమెట్ల : రాష్ట్రంలో దళితులను వేధించి, వారి మరణానికి కారణమైన దళిత ద్రోహి జగన్‌రెడ్డి అని టీడీపీ కూటమి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని సోమవరప్పడు ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు మన్నె రామారావుతో పాటు ఎస్సీ కాలనీ వాసులు పాల్గొన్నారు.

వైసీపీ ఆధ్వర్యంలో

వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్ ఆధ్వర్యంలో శ్రేణులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేష్, మాజీ ఎంపీ చిమటా సాంబు తదితరులు మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా ప్రతి ఒక్కరు నడుచుకోవాలన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ తన అనుచరులతో కలసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు.

పంగులూరులో..

పంగులూరు: డాక్టర్ అంబేడ్కర్ చిరస్మరణీయుడని ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు వరపర్ల సుబ్బారావు అన్నారు. ముప్పవరంలోని టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాలిన రామసుబ్బారావు, కేవీ సుబ్బారావు, టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, కుక్కపల్లి ఏడుకొండలు, వీరరాఘవయ్య, మాజీ సర్పంచ్‌లు ఉన్నం రవిబాబు, అమృతపూడి ఏసోబు, పార్టీ ప్రధాన కార్యదర్శి తెలగతోటి రాధాకృష్ణ, గరిమిడి జగన్, వెంకటరావు, వాసంతు, పుష్పరాజు, సిమోన్ పాల్గొన్నారు.

ఇంకొల్లు : సినిమాహాలు కూడలి, అంబేడ్కర్ నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పలువురు నేతలు నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ బోడాల శ్యాంసుందర్, రామకృష్ణ, సుందరరావు, దాసు, సురేష్‌బాబు, రాజేష్, బాబర్‌బాషా, హనుమయ్య, రఫీ, వెంకటేశ్వర్లు, శ్రీను, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

చినగంజాంలో..

చినగంజాం : అంబేడ్కర్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ, జనసేన నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పొద వీరయ్య, సందు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాయకులు రాయని ఆత్మారావు, అజాద్, చెరుకూరి రాఘవయ్య, టీ.జయరావు, సందు శ్రీనివాసరావు, తాటి రాజశేఖర్, నరహరి శ్రీనివాసరావు, బెల్లంకొండ రమేష్‌బాబు, షేక్ హుస్సేన్ బాషా, పర్వతరెడ్డి పార్థసారథి, చేవూరి రవణమ్మ, షేక్ బాజీ, తుమ్మలపెంట చిన్నా, గంటా వెంకటనారాయణ, గుంద్రెడ్డి నరసింహారావు, దుర్గారావు, ఏసునారాయణ, ఎస్.సూరిబాబు, ఎం.షడ్రక్, జనసేన సీనియర్ నాయకులు తోట ఆశోకచక్రవర్తి పాల్గొన్నారు.

బల్లికురవలో..

బల్లికురవ : అంబేడ్కర్ జయంతిని ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎస్సీ కాలనీ, తహసీల్దార్ కార్యాలయం, ఎస్ఎల్ గుడిపాడులో విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నేతలు పత్తిపాటి నాగయ్య, సురభి రామారావు, కందుకురు పేతురు తదితరులు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్‌లో..

అద్దంకిటౌన్ : అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ క్రమంలో అద్దంకిలోని బంగ్లారోడ్డులో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం, అద్దంకి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అడుసుమల్లి కిషోర్‌బాబు నివాళులర్పించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఐక్య వేదిక నాయకులు జ్యోతి రమేష్‌బాబుతోపాటు పలు సంఘాలు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న వైసీపీ అభ్యర్థి వెంకటేష్, పంగులూరులో నివాళులర్పిస్తున్న టీడీపీ శ్రేణులు

అందరికీ సమప్రాధాన్యం

» గెలుపే లక్ష్యంగా పనిచేయండి
» కూటమి అభ్యర్థి కొండయ్య


కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరిన చల్లారెడ్డిపాలెంవాసులు

చీరాల, ఏప్రిల్ 14 : పార్టీలో ఎప్పుడు చేరామన్నది ముఖ్యం కాదు. పార్టీ కోసం ఎంత పని చేశామన్నదే ముఖ్యమని.. అలాంటి వారికి సమ ప్రాధాన్యత ఉంటుందని కూటమి అభ్యర్థి ఎంఎం కొండయ్య తెలిపారు. టీడీపీ కార్యాలయంలో ఆదివారం జిల్లా రైతు విభాగ కార్యదర్శి కీర్తి వెంకటేశ్వర్లు, చల్లారెడ్డిపాలెం గ్రామ పార్టీ అధ్యక్షుడు కీర్తి పూర్ణల ఆధ్వర్యంలో పంచాయతీ పరిధిలోని జగన్నాథపురానికి చెందిన 40 కుటుంబాలు కొండయ్య వైసీపీని వీడి టీడీపీ సమక్షంలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కొండయ్య మాట్లాడుతూ వారికి భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో నాయకులు గౌరీ అమర్‌నాథ్, నాతాని ఉమామహేశ్వరరావు, గొర్ల రాముడు, గంజి పురుషోత్తమ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల పరిధిలోని చీరాల నగర్‌కు చెందిన పలువురు శనివారం టీడీపీ గ్రామ అధ్యక్షుడు వీర్లంకారెడ్డి, సోమయ్య ఆధ్వర్యంలో కొండయ్య సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి కండువాలువేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో దొంతిబోయిన ఏడుకొండలరెడ్డి, పుట్టా సంతోష్‌రెడ్డి, పుట్టా వెంకటేశ్వరరెడ్డి, తిరుమలరెడ్డి, ఆసాది స్వామిరెడ్డి, రమేష్, మద్దిబోయిన కోటయ్య, గవిని ముషలయ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కమ్మవారి ఆత్మీయసమావేశంలో..

కమ్మవారి ఆత్మీయ సమావేశంలో అభ్యర్థి కొంయ్య టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్మ సామాజికవర్గంతో తన కున్న అనుబంధాన్ని వివవరించారు. అనంతరం కార్యక్రమ నిర్వహకు లు కొండయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కూటమి పార్టీల ప్రతినిధులు నాతాని ఉమామహేశ్వరరావు, గౌరీఅమర్‌నాథ్, రాఘవయ్య చౌదరి, మాజీ ఎమ్మెల్సీ రా జేంద్రప్రసాద్, పోగడదండ రవికుమార్, శివరామప్రసాద్, పద్మిని, నిర్వాహకులు పాల్గొన్నారు.

మండలంలోని దేవాంగపురి పంచాయితీ పరిధిలో ఇంటింట ఎన్నికల ప్రచారం నిర్వహించారు సూపర్‌సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్‌తో ప్రయోజనాలను వివరించారు. తరువాత మున్సిపల్ పరిధిలోని 29వ వార్డులో ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తులపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. రాత్రికి దంతంపేటలో జరిగిన చేనేత ఆత్మీయ సమావేశంలో కూటమి అభ్యర్థి కొండయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.


టీవీని బహూకరిస్తున్న క్లబ్ సభ్యులు

ఎన్టీఆర్ లైబ్రరీకి టీవీ బహూకరణ

కొంకొల్లు, ఏప్రిల్ 14 : మండలంలోని పూసపాడులోని ఎన్టీఆర్ లైబ్రరీ ఆడిటోరియానికి రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెన్టీనియల్ ఆధ్వర్యంలో కొమ్మాలపాటి కుటుంబ సభ్యుల సహకారంతో ఎల్ఈడీ టీవీని బహూకరించారు. క్లబ్ ప్రెసిడెంట్ కొమ్మాలపాటి శ్రీనివాసరావు, సెక్రటరీ రాజగోపాల్ అధ్యక్షతన ఆడిటోరియం సభ్యులైన గ్రామ సర్పంచ్ ఘంటాబాబు, కరణం రమేష్, యార్లగడ్డ రామకృష్ణ, పి.శ్రీనివాసరావు, పూర్ణ, మండవ సహదేవరావుకు సీపీఐ రాష్ట్రనాయకుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, దామచర్ల శ్రీనివాసరావు, మద్దినేని సుధాకరరావు అందజేసారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులను గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పొంకల సుబ్రమణ్యం, సరిపూడి అనిల్, నవీన్ చక్రవర్తి, ఏటుకూరి రత్న, ఏనుగుల రమణబాబు, యలమంచిలి వేణు, ఏడుకొండలు, వి.సురేష్, బోయపాటి ప్రభాకర్, మురళీకృష్ణ, ఎం.వీరయ్య పాల్గొన్నారు.

రౌడీషీటర్లపై నిరంతర నిఘా

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 14 : రౌడీషీటర్లపై పోలీస్ నిఘా నిరంతరం కొనసాగుతుంది. ఎవరు చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా చర్యలు తప్పవని రూరల్ సీఐ నిమ్మగడ్డ సత్యనారాయణ స్పష్టం చేశారు. పోలీస్ స్టేషన్ వద్ద స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సత్ప్రవర్తనతో సాధారణ జీవితం గడపాలని సూచించారు. ఉద్రేగాలకు, కోపాలకు, ప్రలోభాలకులోనే చట్టవ్యతిరేక కార్యకలాపలకు పాల్పడి జైలు పాలైతే ఇంటి వద్ద ఉన్న కుటుంబ సభ్యులు పరిస్థితి ఎలా ఉంటుందో ఆలోచించుకోవాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి దుందుడుకు చర్యలకు పాల్పడినా చట్టప్రకారం శిక్షార్హులు అవుతారన్న విషయాన్ని మదిలో ఉంచుకుని మసలుకోవాలని సున్నితంగా, సూటిగా చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పర్చూరు, ఏప్రిల్ 14: పర్చూరులోని డిగ్రీ కళాశాలలో శంకర్ వైద్య శాల, చిన్మయ మిషన్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పెద్ద ఎత్తున రోగులు చుట్టుపక్కల గ్రామాల నుంచి తరలిరావడంతో ప్రాంగణం కిక్కిరిసింది. రోగులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా నిర్వాహకులు పాబోలు ఉదయ భాస్కర్ నేతృత్వంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. డాక్టర్ శ్యాందేవ్, డాక్టర్ చెందులు రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమం లో పాబోలు గిరిజా కుమారి, కొత్తూరి వెంకటేశ్వరరావు, రావి సత్యన్నారాయణ, కఠారి సత్యం, ఒగ్గిశెట్టి నరసింహం, కాసా అజేయ్, తాటి లింగేశ్వరరావు, కొసనా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యాదాత రాధాకృష్ణమూర్తి సేవలు చిరస్మరణీయం

పర్చూరు, ఏప్రిల్ 14 : నిరుపేద విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పాటు నందించిన స్వర్గీయ పాబోలు రాధాకృష్ణమూర్తి సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర నంది అవార్డ్ గ్రహీత కారుమూరి సీతారామయ్య అన్నారు. పర్చూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం రాధాకృష్ణమూర్తి కాంస్య విగ్రహావిష్కరణ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కారుమూరి మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులకు ఉచిత విద్యను అందించాలన్న సంకల్పంతో క్రిష్ణంశెట్టి కనకయ్య సారథ్యంలో విద్యా సంస్థల ఏర్పాటుకు రాధాకృష్ణమూర్తి అందించిన తోడ్పాటు హర్షనీయమన్నారు. అలాంటి మహోన్నత వ్యక్తుల సేవలను గౌరవించడం అభినందనీయం అన్నారు. రాధాకృష్ణమూర్తి విగ్రహ ఏర్పాటుకు కృషి చేసిన పాబోలు ఉదయ భాస్కర్, గిరిజా కుమారి దంపతులను వక్తలు అభినందించారు. కార్యక్రమంలో షేక్ అహ్మద్‌బాషా, ఒగ్గిశెట్టి నరసింహం, మామిడిపాక హరిప్రసాద్, క్రిష్ణంశెట్టి రమేష్, బీరం సుందరావు, క్రిష్ణంశెట్టి రామకోటేశ్వరరావు, మంగళగిరి కోటేశ్వరరావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, క్రిష్ణంశెట్టి శ్రీనివాసరావు, కొల్లా హనుమంతురావు పాల్గొన్నారు.


రాధాకృష్ణమూర్తి విగ్రహన్ని ఆవిష్కరిస్తున్న సీతారామయ్య